

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

అర్జీలపై అలసత్వం వద్దు: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వ్యయప్రసాలకోర్చి వచ్చి అర్జీలు ఇస్తుంటారని, వాటిపట్ల అలసత్వం వద్దని అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 233 మంది నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సమీక్షలో జేసీ అభిషేక్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

● అగ్రిగోల్డు బాధితులు కలెక్టర్‌ను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. వివిధ పథకాల పేరుతో ఆ సంస్థ తమను మోసగించి 11 సంవత్సరాలు గడిచినా న్యాయం జరగలేదని బాధితులు అత్తార్ మహబూబ్‌బాషా, షబ్బీర్‌ఖాన్, ఆంజనేయులు, శంకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆనంద్‌బాబు, ఉత్తప్ప తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా తమకు డబ్బులు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

భూ రీ సర్వేపై సమీక్ష

జిల్లాలో జరుగుతున్న భూ రీసర్వే ప్రక్రియను ఆర్డీఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి భూ రీసర్వే, ఫ్రీ హోల్డు, రెవెన్యూ, పీజీఆర్ఎస్ సమస్యలపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్డీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి రికార్డులను తయారు చేయాలని ఆదేశించారు. గ్రామ రెవెన్యూ, రెవెన్యూ డివిజన్ అధికారుల లాగిన్‌లో ఉన్న రికార్డులను ఈ నెల 28లోపు నవీకరించాలని ఆదేశించారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం..!

కమ్మూరు ఉన్నత పాఠశాలలో ఆగిపోయిన పనులు

విద్యార్థులకు తప్పని తిప్పలు

తాగడానికి బోరు నీరే దిక్కు

7

నూతన ఒరబడి

అంగన్‌వాడీల నుంచే కొత్త విద్యావిధానం

1,2 తరగతులను కలిపి ఫౌండేషన్ కోర్సు

పూర్వ ప్రాథమిక విద్యాబోధనపై శిక్షణ

అంగన్‌వాడీ వర్కర్లకు బోధనలో మెలకువలు

మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు చర్యలు

కదిరి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెట్టనున్న నూతన విద్యావిధానంతో ఫౌండేషన్, మోడల్ ప్రాథమిక పాఠశాలలు పటిష్ఠం కానున్నాయి. ఈనేపథ్యంలోనే ఫౌండేషన్ కోర్సు బోధించే అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. పూర్వ ప్రాథమిక విద్యకు వచ్చే చిన్నారులకు ఎలా బోధించాలో శిక్షణ ఇస్తోంది. పేద, మధ్యతరగతివారు ఎక్కువగా చదువుకునే ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గతంలో అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాలలు వేర్వేరుగా ఉండేవి. నూతన విద్యా విధానంలో పూర్వ ప్రాథమిక విద్యతోపాటు 1, 2, తరగతులను కలిపి ఏగ్రామంలో ఉన్నారో ఆగ్రామంలోనే ఏర్పాటు చేయడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీన్ని ఫౌండేషన్ కోర్సుగా చెబుతున్నారు.

మోడల్ ప్రాథమిక పాఠశాల ఇలా..

పంచాయతీ పరిధిలో అన్ని సౌకర్యాలున్న ఒక పాఠశాలను ఎంచుకుని, కిలోమీటర్ పరిధిలో ఉన్న ఇతర ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను ఆపాఠశాలలో చేర్చేలా యంత్రాంగం పావులు కదుపుతోంది. ఈపాఠశాలకు మోడల్ ప్రాథమిక పాఠశాలగా పేరు పెట్టారు. ఆ పాఠశాలకు రావడానికి ఇతర గ్రామాల విద్యార్థులకు రవాణా చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈపాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారు. విద్యార్థుల సంఖ్య 60కిపైగా ఉంటే అదనంగా మరో ఉపాధ్యాయుడిని కేటాయిస్తారు. అదే వంద దాటితే ప్రాథమిక ప్రధానోపాధ్యాయులు కూడా ఆపాఠశాలలో ఉంటారు. ఈవిధంగా ఫౌండేషన్, మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసి, డ్రాపౌట్ల సంఖ్య తగ్గించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.



శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ వర్కర్లు

పూర్వ ప్రాథమిక విద్యాబోధనపై శిక్షణ

పూర్వ ప్రాథమిక విద్యను బోధించడానికి అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం మండల కేంద్రాల్లో ఇప్పటికే శిక్షణ ప్రారంభించింది. 120రోజుల పాటు విడతల వారిగా ఈశిక్షణ కొనసాగనుంది. 20రోజులకు ఒక విడతగా శిక్షణ ఇస్తోంది. ఇందులో తొలి 14రోజులపాటు ఆన్‌లైన్ శిక్షణ, మిగిలిన ఆరు రోజులు భౌతిక శిక్షణ ఇస్తున్నారు. ఇందులో ఆరురోజులు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి, అందులో శిక్షణ తీసుకున్న ఆర్పీలచే అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు. మూడు సంవత్సరాలు, నాలుగు సంవత్సరాలు పైబడిన చిన్నారులకు ఆటలు, భాషాజ్ఞానం, పరిసరాల విజ్ఞానంతో ఇతర అంశాలపై ఎలా బోధించాలో శిక్షణ ఇస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్యాబోధన శిక్షణతో మూడు, నాలుగు సంవత్సరాలు పైబడిన విద్యార్థులు, 1, 2, తరగతుల విద్యార్థులు శరీరక, మానసిక విజ్ఞానం పెంపొందుతుందని అధికారులు పేర్కొన్నారు.

బోధనలో మెలకువలు

పూర్వ ప్రాథమిక విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంలో అంగన్‌వాడీ టీచర్లకు మెలకువలు నేర్పారు. ముఖ్యంగా ఆటలాడటం, బొమ్మలతో పజిల్స్ చేయడం, పరిసరాలతో మెలగడం, భాషా పరిజ్ఞానాన్ని ఎలా పెంపొందింపజేయాలో శిక్షణ ఇస్తున్నారు. ఈ మెలకువతో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తమ పరిధిలోని విద్యార్థులకు విద్యాబోధన చేయనున్నారు. కార్పొరేటుకు దీటుగా ఇక్కడ విద్యాబోధన చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఫౌండేషన్ విద్యలో 3,4 సంవత్సరాలు పైబడిన వారితోపాటు 1, 2, తరగతుల విద్యార్థులు కలిసి ఉంటారు. ప్రభుత్వం ఉపాధ్యాయుడితోపాటు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులుకూడా కలిసే ఉండటంతో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఇకమీదట కానరావు. 120రోజుల పాటు బోధనపై మెలకువలు ఇవ్వడం ద్వారా అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పరిపూర్ణంగా బోధనకు సిద్ధమవుతారని అధికారులు స్పష్టం చేశారు.

తగ్గనున్న డ్రాపౌట్స్

ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నూతన విద్యావిధానంతో డ్రాపౌట్స్ సంఖ్య తగ్గుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఫౌండేషన్ కోర్సులో 3,4 సంవత్సరాలు పైబడిన పిల్లలతోపాటు 1,2 తరగతులు కూడా ఉంటారు. అక్కడి నుంచి నేరుగా మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులను చేర్చుకుంటారని, తరువాత హైస్కూల్ విద్యకు పంపడానికి ఆస్కారముంటుందంటున్నారు.



ఎంతో ఉపయోగపడింది

ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తున్న శిక్షణ ఎంతో ఉపయోగపడింది. ఆరురోజులపాటు శిక్షణ ఇవ్వడం అనేక విషయాలు తెలియ చెప్పడంతో, పూర్వప్రాథమిక విద్యార్థులకు ఎలా బోధించాలో అర్థమైంది. బోధనలో మెలకువలు సైతం బాగా నేర్చారు.

\- లక్ష్మీదేవి, అంగన్‌వాడీ వర్కర్, కదిరి

విద్యార్థులకు ఉపయోగం

నూతన విద్యా విధానం విద్యార్థులకు బాగా ఉపయోగపడనుంది. ఫౌండేషన్, మోడల్ ప్రైమరీ పాఠశాలల ద్వారా డ్రాపౌట్లు తగ్గుతాయి. ప్రతి గ్రామంలో పాఠశాలతోపాటు ఉపాధ్యాయులుకూడా అందుబాటులో ఉంటారు. తద్వారా విద్యాబోధనకు ఎటువంటి ఆటంకం కలగదు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది.

\- మాబున్నీసా, అంగన్‌వాడీ వర్కర్, కదిరి



క్షయం కాని రోగం

జిల్లాలో చాపకింద నీరులా మహమ్మారి

గడచిన నాలుగేళ్లలో 202 మంది మృతి

గ్రామాల్లో కనిపించని అవగాహన సదస్సులు

ప్రతి ఏటా పెరుగుతున్న బాధితులు

కొత్తచెరువు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షయ(టీబీ) చాపకింద నీరులా విస్తరిస్తోంది. పిల్లల నుంచి, వృద్ధుల వరకూ బాధితులు ఉంటున్నారు. ప్రతి ఏటా క్షయ రోగులు పెరుగుతూనే ఉన్నారు. ప్రభుత్వాలు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. వ్యాధిని గుర్తించి, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని, చికిత్స చేయించుకోకపోవడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో క్షయ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే వైద్య సిబ్బంది పల్లెలకు వెళ్లకుండా సెల్‌ఫోన్లలో అరకొర సమాచారమిస్తున్నట్లు గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

క్షయ వ్యాప్తి, లక్షణాలు

క్షయ ఒక అంటువ్యాధి. క్షయ రోగి దగ్గినపుడు, తుమ్మినపుడు క్రిములు(బ్యాక్టీరియా) గాలిలో కలిసి ఇతరులకు వ్యాపిస్తుంది. క్షయ సోకినవారికి రెండూ లేదా మూడు వారాలు ఎడతెరిపి లేకుండా దగ్గు, జ్వరం వవస్తూ ఉంటుంది. ఆకలి లేకపోవడం, శరీర బరువు తగ్గుతారు. ఈ వ్యాధి పోషకాహార లోపం, కిడ్నీ, కాలేయ వ్యాధులు, అతిగా మద్యం, ధూమపానం సేవించే వారికి, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులకు, మధుమేహం(షుగర్) నియంత్రణలో ఉంచుకోని వారికి సోకుతుంది. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోని వారే ఈ వ్యాధి బారిన పడుతున్నారని వైద్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. కొంత మంది వ్యాధి లక్షణాలున్నా వైద్య పరీక్షలు చేయించు కోలేదని, రోగం ముదిరిన తర్వాత ఆసుపత్రులకు వస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు.



ఉచితంగా పరీక్షలు

క్షయ సోకిందా లేదా అని తెలుసుకోవడానికి జిల్లాలో పుట్టపర్తి, కదిరి, పెనుకొండ, ధర్మవరం, మడకశిర, తనకల్లు, హిందూపురం అర్బన్, రూరల్ వైద్యశాలల్లో ట్యూబర్‌క్యులోసిస్ యూనిట్లు ఉన్నాయి. వీటిలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తు ఉచితంగా మందులను అందిస్తారు. క్షయవ్యాధి బాధితులకు అవసరమైన సాయం నిక్షయ్ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. క్షయవ్యాధి తీవ్రత ఆధారంగా డ్రగ్ సెన్సిటివ్ టీబీ, డ్రగ్ రెసిస్టెంట్ టీబీగా విభజించారు. డ్రగ్ సెన్సిటివ్ టీబీకి ఆరు నెలలు చికిత్స తీసుకోవాల్సి ఉండగా, డ్రగ్ రెసిస్టెంట్ టీబీకి వ్యాధి తీవ్రత ఆధారంగా ఆరు నెలల నుంచి 18 నెలల వరకు చికిత్స తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

జిల్లాలో నాలుగేళ్లలో టీబీ యాక్టివ్ కేసుల వివరాలు

సంవత్సరం	టీబీ యాక్టివ్ కేసులు
2021	2388
2022	2671
2023	2339
2024	2119

బాధితులకు నెలకు రూ. 500

క్షయవ్యాధి జుట్టు, గోళ్లు మినహా శరీరంలోని అన్ని అవయవాలకు వ్యాపించే అవకాశాలు ఉన్నాయని డాక్టర్లు తెలియజేస్తున్నారు. ఎక్కువగా ఊపరితిత్తులు, ఎముకలు, పేగులు, మూత్రపిండాలు, మెదడు, వెన్నెముక తదితర అవయవాలకు సోకే అవకాశం ఉంది. ప్రస్తుతం అధునాతన మందుల ద్వారా క్షయవ్యాధిని వందశాతం నయం చేయవచ్చునని వైద్యులు చెబుతున్నారు. క్షయవ్యాధి రోగులకు పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నెలకు...రూ:500 చొప్పున ఆర్థిక సాయం అందజేస్తోంది.



టీబీ సోకిన వ్యక్తి ఎక్స్‌రే చూపిస్తున్న డాక్టర్

నాలుగేళ్లలో 202 మంది మృతి

జిల్లా వ్యాప్తంగా గడచిన నాలుగేళ్లలో 2021లో 55, 2022లో 45, 2023లో 48, 2024లో 54 మంది క్షయ వ్యాధితో మృతి చెందారు. మొత్తంగా 202 మంది మృత్యువాతపడినట్లు వైద్యగణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



ప్రభుత్వ పీహెచ్‌సీల్లో క్షయ(టీబీ) వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఉచితంగా మందులు అందించడంతో పాటు వారు పాటించాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లను తెలియజేస్తున్నాం. క్షయ ఉన్నవారు మాస్కు ధరించాలి. దీంతో వైరస్ మరొకరికి త్వరగా సోకదు. ముఖ్యంగా క్షయ బాధితులు క్రమం తప్పకుండా ప్రతిరోజు మందులు వేసుకోవాలి. వ్యాధి నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ప్రజల్లో అవగాహన పెరిగితేనే నియంత్రణ సాధ్యమవుతుంది.

\- డాక్టర్ తిప్పయ్య,
జిల్లా క్షయ నివారణఅధికారి



పూజలు నిర్వహిస్తున్న సజ్జనార్, కుటుంబ సభ్యులు

లేపాక్షిలో సజ్జనార్ పూజలు

లేపాక్షి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గావీరభద్రస్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర రోడ్లు, రవాణాశాఖ ఎండీ సజ్జనార్ సోమవారం కుటుంబ సమేతంగా పూజలు చేశారు. గతంలో ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఉన్న ధ్వజస్తంభం కూలిపోతే ఆయన సొంత నిధులతో పునర్నిర్మించారు. వీరభద్రస్వామి ఆయన ఇలవేల్పు. ప్రతి సంవత్సరం ఆయన ఆలయాన్ని సందర్శిస్తుంటారు. ఆలయానికి వచ్చిన సజ్జనార్‌కు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి లేపాక్షిలో శివరాత్రి వేడుకలు

వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి

అలరించనున్న బుల్లితెర నటులు

లేపాక్షి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. వీరభద్రస్వామి ఆలయం, ఏకశిలా నంది విగ్రహం, లేపాక్షి పురవీధుల్లో విద్యుత్ దీపాలను సిద్ధం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి 12గంటల వరకు మహాగణపతి సుదర్శనహోమం నిర్వహిస్తామని అన్నారు. బుధవారం మహాశివరాత్రి అభిషేకాలు, దీపోత్సవం, రుద్ర హోమం, స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తీ చేశామన్నారు. 26న రాత్రి జాగరణకు బుల్లితెర నటులు, యాంకర్లతో పాటకచేరి, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 27న మధ్యాహ్నం 1 గంటకు స్వామివారి బ్రహ్మరథోత్సవం ఉంటుందన్నారు. 28న ముత్యాలపల్లకి కీలుగుర్రాలతో వేడుకలను వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. 1న వసంతోత్సవం, ధ్వజారోహణ, శయనోత్సవంతో శివరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. భక్తులకు అన్నదాన ప్రసాదాలు ఏర్పాటు చేశామని తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి



ఏడు శిరస్సుల నాగేంద్రుడు

జాతీయ స్థాయి పోటీలకు

పట్టుపోగులను అతికించే ప్రాజెక్టు

కొత్తచెరువు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మేడిన్ త్రీడీ ఫ్యూచర్ ఎంటర్ ప్రెన్యూర్ ప్రోగ్రాం-2025కు ధర్మవరం మోడల్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన నమూనా ఎంపికైంది. రాష్ట్రంలోని ఏటీఎల్ పాఠశాలల విద్యార్థులు వందకుపైగా ప్రాజెక్టులను రాష్ట్ర సైన్స్ విభాగానికి ఆన్‌లైన్‌లో పంపించారని జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ తెలిపారు. ఇందులో ఐదు ప్రాజెక్టులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపియ్యాయని, ఐదింటిలో ధర్మవరం విద్యార్థుల ప్రాజెక్టు ఉందని ఆయన వెల్లడించారు. చేనేత వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం ధర్మవం మోడల్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రాజెక్టును రూపొందించారని తెలిపారు. చేనేత చీర పోగులు తెగిపోతే.. వాటిని అతికించడానికి ఉపయోగపడేలా ఎలక్ట్రికల్ పరికరం నమూనాను విద్యార్థులు తయారు చేశారని అన్నారు. ఈ ప్రాజెక్టు అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.20 వేలను విద్యార్థులకు అందించిందని అన్నారు. ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థులు సంజయ్, హేమంత్‌కుమార్, లావణ్య, అక్షయజ్యోతి, గుణశ్రీ, మేఘనను, గైడ్ టీచర్ శ్రావణిని ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన నమూనాతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కిటకిట..!

రోగులతో కిక్కిరిసిన పెద్దాస్పత్రి

'ఓపీ'క లేక తీవ్ర ఇబ్బందులు

డాక్టర్ల వద్ద, మందులు ఇచ్చే చోటా భారీ క్యూ

తీవ్ర అవస్థలు పడ్డ రోగులు, బంధువులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పగటిపూట ఎండలు ముదరటం, రాత్రిపూట చలివాతావరణంతో ప్రజలను రోగాలు చుట్టుముడుతున్నాయి. వివిధ రకాల జబ్బులతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రి సోమవారం రోగులతో కిక్కిరిసిపోయింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన బాధితులు కూడా ఈ ఆస్పత్రికే చికిత్స కోసం వచ్చారు. రోగాలు వేలాదిగా రావడంతో ఓపీ కేంద్రం కిక్కిరిసిపోయింది. చీటీ కోసం గంటలకొద్దీ క్యూలో ఉండాల్సి వచ్చింది. తోపులాట కూడా జరిగింది. ఓపీతీసుకున్న వారు తిరిగి బయటకు రావడానికికూడా స్థలం ఇవ్వకపోవడంతో నానా అవస్థలు పడాల్సి వచ్చింది. కొందరైతే ఓపీకేంద్రంలోనే ఉక్కపోతకు అల్లాడిపోతూ అక్కడే కూర్చుండిపోయారు. డాక్టర్లతో చికిత్స చేయించుకోవడానికి కూడా గంటల కొద్దీ వేచి ఉండాల్సి వచ్చింది. మందులు ఇచ్చే కేంద్రాల వద్దా ఇదే పరిస్థితి. దీంతో రోగులు, వారి బంధువులు కూడా నానా అవస్థలు పడ్డారు.

ప్రత్యామ్నాయం చూపకపోతే తిప్పలే

పెద్దాస్పత్రికి రోజురోజుకు రోగుల తాకిడి విపరీతంగా పెరుగుతోంది. ఆమేరకు అవసరమైన చర్యలు తీసుకోవడం, సౌకర్యాల కల్పనలో పాలకులు విఫలమవుతున్నారు. రాబోయే మూడునెలలు ఎండాకాలం కావడంతో ప్రజలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితులలో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడకుండా ఓపీ చీటీలు సులభతరంగా అందించేందుకు ఆలోచించాలి. అలాగే డాక్టర్లు, మందులు విభాగాల వద్ద త్వరగా పేషెంట్లకు వైద్యచికిత్సలు, మందులు అందేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే రాబోయే రోజులలో రోగులు మరిన్ని కష్టాలు ఎదుర్కోక తప్పదు.



రోగులతో కిటకిటలాడుతున్న ఓపీ కేంద్రం

ఓపీ కోసం గంటలా...



అసలే రోగంతో అల్లాడుతూ ఆస్పత్రికి వస్తాం. ఇక్కడకు వస్తే ఓపీ చీటీ కోసం గంటల కొద్దీ క్యూలో ఉండాల్సి వస్తోంది. దీంతో మరిన్ని వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది. ఇది సరికాదు. రోగులు ఇబ్బంది పడకుండా వైద్యం అందించేలా చూడాలి.

-బయ్యన్న, పేషెంట్

ముసలోళ్లకు ఇన్ని తిప్పలా..?



ఆస్పత్రిలో పెద్ద డాక్టర్లు ఉన్నారని చూపించుకోవడానికి ఇక్కడకు వస్తాం. ఇక్కడ ఇన్నితిప్పలు పడాల్సి రావడం బాధ కలిగిస్తోంది. అందులోనూ మా లాంటి ముసలోళ్లు గంటలపాటు ఇబ్బదులు పడి, ఎలా తట్టుకోగలం. రోగులకు ఇబ్బదులు లేకుండా చర్యలు చేపడితే ఆస్పత్రికి మంచి పేరు వస్తుంది.

-పద్మావతి, పేషెంట్

అన్నిచోట్లా అవస్థలేనా..?



చికిత్స కోసం సర్వజన ఆస్పత్రికి వస్తే ఇక్కడ అన్ని చోట్లా ఇబ్బంది పడాల్సి వస్తోంది. అవస్థలుపడి ఓపీ చీటీ తీసుకొని డాక్టర్ వద్దకు వెళితే అక్కడా క్యూ భారీగా ఉంది. మందుల కోసం పోతే అక్కడా బారులు తీరారు. ఇలాంటి పరిస్థితులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలి

-చంద్రమోహన్, పేషెంట్

అనంత నృత్యానికి అవార్డు



జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందుకుంటున్న హరిప్రసాద్ బృందం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో అనంత కళాకారులు ప్రతిభ చాటారు. భరతముని జయంతిని పురస్కరించుకుని సంస్కార భారతి, సుమధుర కళానికేతన్ సంయుక్తాధ్వర్యంలో విజయవాడలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన జాతీయస్థాయి శాస్త్రీయ నృత్యపోటీల్లో వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శనలిచ్చారు. అనంతపురం నగరానికి చెందిన లహరి డ్యాన్స్ ఫిట్‌నెస్ అకాడమీ హరిప్రసాద్ శిష్యబృందం విశాల్, సాయి భరద్వాజ్, అహ్మద్, మనోజ్, కార్తీక్, అక్షయ జానపద నృత్య విభాగంలో జాతీయస్థాయిలో విజేతగా నిలిచింది. వీరి బృందానికి సంస్కార భారతి సాహిత్య సంయోజకుడు కప్పగంతు రామకృష్ణ, సుమధుర కళానికేతన్ గౌరవాధ్యక్షుడు ఎంసీ దాస్, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు ఎస్పీ భారతి, విశ్రాంత సైనికాధికారి చలసాని బలరామయ్య.. జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు.

వంద కోట్లు ఇక్కడ..!

నాకే పనిచెబుతారా..?

పుట్లూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'వంద కోట్ల ఆస్తిపరున్ని. నాకే చిన్న చిన్న పనులు చెబుతారా?' అంటూ ఓ పంచాయతీ కార్యదర్శి పుట్లూరు ఎంపీడీఓపై చిందులు వేశారు. ఎం-బుక్కులో సంతకం కోసం మూడు రోజుల క్రితం ఆయన ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. కార్యాలయంలో ఓ అధికారి సంతకం పెట్టకపోవడంతో ఆయన రెచ్చిపోయారు. 'తాడిపత్రిలో నాకు రూ.వందకోట్ల ఆస్తి ఉంది. నాకే రీపోల్ సర్వే పనులు చెబుతారా?' అంటూ ఎంపీడీఓపైనే చిందులు వేశారు. అలా మాట్లాడటం పద్ధతి కాదని ఉద్యోగులు సర్దిచెప్పినా వినిపించుకోలేదు. పైగా వారిపైనా అంతెత్తు లేచారు. 'మీరెంత..? మీ స్థాయి ఎంత..?' అని హేళన చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలోని ఓ మహిళా ఉద్యోగిని ఆయన కొన్ని నెలల నుంచి వేధిస్తున్నారని సమాచారం. కార్యాలయంలో చిన్నపాటి ఖర్చుల విషయంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. ఆ అధికారి వ్యవహారశైలి సోషల్ మీడియాకు చేరింది. ఆ కార్యదర్శి వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులకు నివేదించామని ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు.

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సీడాప్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ కార్పొరేషన్ ఉమ్మడి అనంత జిల్లా ఈడీ సుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం అనంతపురంలోని కోర్టు రోడ్డు నందుగల జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, రాయదుర్గంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మైనార్టీ వర్గాలకు చెందిన ముస్లిం, క్రైస్తవ, సిఖ్, బౌద్ధ, జైన యువతీ, యువకులు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు ఫెన్సింగ్ జట్టు ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, పుష్పావతి తెలిపారు. అండర్-14 బాల, బాలికల క్యాటగిరిలో స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఎన్టీఆర్ జిల్లాలో మార్చి 2న నిర్వహించే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9553768295ను సంప్రదించాలని కోరారు.

డ్వామా ఏపీడీలకు స్థానచలనం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): డ్వామా పరిధిలోని పలువురు ఏపీడీలకు స్థానచలనం కల్పించారు. గుత్తి క్లస్టర్ ఏపీడీగా ఉన్న విజయ్‌కుమార్‌ను తాడిపత్రి క్లస్టర్ ఏపీడీగా బదిలీ చేశారు. ఉరవకొండ ఏపీడీగా ఉన్న గిరిధర్‌ను తప్పిస్తూ విజయ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రాయదుర్గం ఏపీడీగా ఉన్న అయేషాను గుత్తికి బదిలీ చేశారు. కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ నాగేశ్వరరావుకు రాయదుర్గం క్లస్టర్ ఏపీడీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సోమవారం డ్వామా పీడీ సలీంబాషా ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థి అదృశ్యం



శశికుమార్

గార్లదిన్నె, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన శశికుమార్ అనే విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు. మర్తాడు గ్రామానికి చెందిన సుధాకర్ కుమారుడు శశికుమార్ స్థానిక ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం కోటంకలో జరుగుతున్న తిరునాళ్లకు ఇంట్లో చెప్పకుండా వెళ్లి వచ్చాడు. ఇంట్లో చెప్పకుండా వెళతావా అంటూ తల్లి ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో శశికుమార్ కనిపించకుండా వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు స్నేహితులు, బంధువుల వద్ద వెతికారు. కనిపించకపోవడంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాజీ.. ఈజీ కాదు..!

మూడేళ్లకు పైగా శిక్ష పడే కేసుల్లో విచారణ తప్పదు

ప్రత్యక్ష సాక్షులు చెప్పకపోయినా.. నేరం రుజువు కావచ్చు

మట్టి పవన్ కుమార్ హత్య కేసులో ఫలించని రాజీ

ఐదుగురు ముద్దాయిలకు జీవితకాల శిక్ష

పెడతోవ పట్టిన పేద కుటుంబాల యువకులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష సాక్షులు మౌనం వహించినా.. హత్య కేసులో ఐదుగురికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష పడింది. అరుదైన ఈ తీర్పును అనంతపురం జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ వెలువరించారు. నార్పల మండల కేంద్రానికి చెందిన మట్టి పవన్‌కుమార్ హత్య కేసులో నేరాన్ని డిజిటల్ సాక్ష్యాలు, అధికారుల వాంగ్మూలం ఆధారంగా నిర్ధారించారు. ముద్దాయిలు ఐదుగురికి కఠిన జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ20 వేల జరిమానా విధించారు. న్యాయవాదుల సమక్షంలో రాజీ కుదిరినా, క్రిమినల్ కేసు కావడంతో ముద్దాయిలు విచారణను ఎదుర్కొనక తప్పలేదు. ప్రాసిక్యూషన్, డిఫెన్స్ వాదించకా తప్పలేదు. ఈ కేసు తీర్పు సంచలనంగా మారింది. సివిల్ కేసులో ఎంతటి వివాదం ఉన్నా రాజీ కావచ్చు. కానీ క్రిమినల్ కేసుల్లో రాజీ అంత ఈజీ కాదంటున్నాయి న్యాయవాద వర్గాలు. సివిల్ కేసుల్లో రెండు పార్టీలు నిబంధనల ప్రకారం ఒప్పంద పత్రాన్ని రాసుకుని, న్యాయసేవా అధికార సంస్థ నిర్వహించే లోక్ అదాలత్‌లో రాజీ కావచ్చు. క్రిమినల్ కేసుల్లో కొన్ని సెక్షన్లకు రాజీ కుదిరే అవకాశం ఉంటుంది. మూడేళ్లలోపు శిక్ష పడే కేసులకే ఈ వెసులుబాటు ఉంటుంది. అంతకు మించి శిక్ష పడే సెక్షన్లు ఉంటే రాజీ కుదరదు. హత్య, హత్యాయత్నం, మహిళలను అసభ్యంగా తాకడం, అసభ్యంగా ప్రవర్తించడం, దివ్యాంగులపై దాడి వంటివి తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. వీటి విషయంలో రాజీకి తావులేదు. చెక్‌బౌన్సు కేసులలో కూడా ఒక్కోసారి రాజీ కుదరదని న్యాయవాదులు చెబుతున్నారు.

కేసు వాదించాల్సిందేనా..?

ఇరువర్గాలు రాజీ అయితే కేసు తేలిపోతుందని, ఇంకేమీ ఉండదని భావిస్తారు. కానీ తీవ్రమైన నేరాల విషయంలో రాజీపడినా కేసు కొనసాగుతుంది. రాజీ కుదిరితే.. అవతలి వారు డబ్బు తీసుకుని సాక్ష్యం చెప్పరు. ఒక్కోసారి సాక్షులంతా వ్యతిరేకంగా చెబుతుంటారు. గతంలో తాము అలా చెప్పలేదని కూడా తేలిపోతుంటారు. ఇలాంటి సందర్భంలో కేసు వీగిపోయే అవకాశాలు ఉంటాయి. ఇవన్నీ రాజీ కారణంగా జరిగే పరిణామాలు. కానీ తర్పుమాత్రం న్యాయాధికారి నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మట్టి పవన్‌కుమార్ హత్య కేసులోనూ ప్రత్యక్ష సాక్షులు ఏమీ చెప్పలేదు. కానీ హత్య చేస్తుండగా తీసిన వీడియో, పోస్టుమార్టం చేసిన వైద్యుల నివేదిక, పోలీసు అధికారుల సాక్ష్యం ఇవన్నీ కేసును బలంగా నిలబెట్టాయి. రాజీ కుదిరినా.. ముద్దాయిలకు శిక్ష తప్పలేదు.

జైలుపాలైన ఐదుగురు ముద్దాయిలు వీరే..



హతుడు, తండ్రిపైనా కేసులు

హతుడు మట్టి పవన్‌కుమార్, అతని తండ్రిపైనా కేసులున్నాయి. పవన్ కుమార్‌పై నార్పల పోలీస్‌స్టేషన్‌లో బైక్ దొంగతనం కేసు, అమ్మాయిల వేధింపుల కేసు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం నార్పలలో సినిమా థియేటర్‌కు వెళ్లాడు. అక్కడ రష్‌గా ఉండటంతో కానిస్టేబుల్ గౌస్ వెళ్లిపొమ్మని హెచ్చరిస్తూ లాఠీతో ఓ దెబ్బ వేశాడు. దీంతో ఇంటికి వచ్చిన పవన్‌కుమార్, తల్లిదండ్రులతో విషయం చెప్పాడు. వెంటనే ఇద్దరూ ఓ కత్తి ఇచ్చి పొడిచి రమ్మని చెప్పారట. పవన్‌కుమార్ ఆ కత్తి తీసుకొచ్చి కానిస్టేబుల్‌ను వెనుకనుంచి పొడిచాడు. అతనికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఈ ఘటనపై నార్పల పోలీస్‌స్టేషన్‌లో పవన్‌కుమార్, తండ్రి శ్రీనివాసులు, తల్లిపైనా కేసు నమోదైంది. అది ఇంకా కోర్టులో నడుస్తోంది. ఎర్రచందనం తరలిస్తున్న ఐచర్‌లో వెళ్లడంతో శ్రీనివాసులుపై చిత్తూరు జిల్లాలో కేసు నమోదైంది.

రూ.16 లక్షలు పోశాం!

ఈ కేసులో రాజీ కుదుర్చుకునేందుకు న్యాయవాదుల సమక్షంలో డబ్బులు ఇచ్చామని ముద్దాయిల తల్లిదండ్రులు కోర్టు ప్రాంగణంలో ఆరోపించారు. ఐదుగురి తరపున మొత్తం రూ.16 లక్షలు ఇచ్చామని తెలిపారు. కోర్టు తీర్పు వెలువడగానే ముద్దాయిల తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. హతుడి కుటుంబ సభ్యులకు డబ్బు ఇచ్చినా రాజీ కుదరలేదని కన్నీటి పర్యంతమయ్యారు. హత్యకు గురైన పవన్‌కుమార్ గతంలో ఓ కానిస్టేబుల్‌ను పొడిచినా, మరిన్ని అరాచకాలు చేసినా కేసులు పెట్టలేదని అన్నారు. అలాంటి వాణ్ని చంపిన తమ వారిని జైలుకు పంపుతున్నారని వాపోయారు. కాగా, కోర్టు ప్రాంగణంలో ముద్దాయిల తల్లిదండ్రులు చేసిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. కేసు జరుగుతున్న క్రమంలో ఓ ప్రముఖ న్యాయవాది సమక్షంలో హతుడి తల్లిదండ్రులకు రూ.12 లక్షలు ఇప్పించినట్లు సమాచారం. మిగిలిన రూ.4 లక్షలు ముద్దాయిల తల్లిదండ్రులకు వెనక్కు ఇచ్చారన్న ప్రచారం జరిగింది. రాజీ నేపథ్యంలో సాక్షులుగా ఉన్నవారు కోర్టులో జరిగింది చెప్పడానికి నిరాకరించినట్లు తెలిసింది.

పేద కుటుంబాలు..



జిల్లా కోర్టు వద్ద ముద్దాయిల కుటుంబ సభ్యుల కన్నీరు..

హత్యకేసులో శిక్ష పడిన ఐదుగురివీ పేద కుటుంబాలు. కొడుకులు సంపాదిస్తే తప్ప పూట గడవదని తల్లిదండ్రులు కంటతడి పెట్టారు. కుటుంబ పరిస్థితులు తెలిసినా.. వ్యసనాలు, చెడు సావాసాల కారణంగా జైలుపాలయ్యారు. మట్టి పవన్‌కుమార్ హత్య కేసులో నార్పలకు చెందిన డిపో సాజిద్, చింతాకు రమేష్, చిక్కేపల్లి నాగేంద్ర, తలారి సుధాకర్, తలారి అరుణ్‌కు జీవితకాలపు కఠిన కారాగార శిక్ష పడింది. వీరందరికీ 25 ఏళ్లలోపే వయసు. ఎంతో భవిష్యత్తున్న వీరు జైలు పాలు కావడానికి వారు ఎంచుకున్న దారే కారణం.

- సాజిద్ తండ్రి చిన్న మహబూబ్‌బాషా వంట మాస్టర్. శుభకార్యాలు ఉన్నప్పుడు పని దొరుకుతుంది. తల్లి ముష్కినా గృహిణి. ఇద్దరు కొడుకులు. సాజిద్, అతని అన్న బాబావలి ఇద్దరూ మెకానిక్‌లు. సాజిద్‌కు వివాహం కాలేదు. మద్యానికి బానిసయ్యాడు. గతంలో గొడవలకు వెళ్లాడు. ఒకటి రెండు కేసులు ఉన్నట్లు సమాచారం.
- చింతాకు రమేష్ తల్లిదండ్రులు పెద్దకుల్లాయప్ప, వరలక్ష్మి. మూడెకరాల పొలంలో వ్యవసాయం చేస్తుంటారు. వీరికి ఒక కూతురు కూడా ఉంది. రమేష్ అనంతపురంలోని పీవీకేకే డిగ్రీ కళాశాలలో సెకండియర్ చదువుతున్నాడు. గతంలో కేసులేమీ లేవు. ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ అనధికారికంగా విడిపోయారు.
- తలారి సుధాకర్ తల్లిదండ్రులు పుల్లయ్య, ఈశ్వరమ్మ. తండ్రి కొన్నేళ్ల క్రితమే మృతి చెందాడు. సుధాకర్‌కు ఇద్దరు సోదరులు.. వారు చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్నారు. సుధాకర్ ప్లాస్కులో టీ అమ్ముతూ జీవనం సాగించేవాడు. మద్యం తదితర వ్యసనాలున్నాయి. గతంలో కేసులేమీ లేవు.
- చిక్కేపల్లి నాగేంద్ర తల్లిదండ్రులు నాగరాజు, లక్ష్మి. తండ్రి నాగరాజు కొన్నేళ్ల క్రితమే చనిపోయాడు. లక్ష్మి కూలి పనికి వెళ్తుంటుంది. నాగేంద్రకు మద్యం వంటి వ్యసనాలున్నాయి. ఎలాంటి పని చేయడు. కేసులేమీ లేవు.
- తలారి అరుణ్ తల్లిదండ్రులు ఆదినారాయణ, లక్ష్మీదేవి. ఇద్దరూ కూలి పనిచేస్తుంటారు. వీరికి కూతురు కూడా ఉంది. తలారి అరుణ్ స్నేహితులతో కలిసి జులాయిగా తిరిగేవాడు. ఇతనిపైనా గతంలో కేసులేమీ లేవు.

న్యాయం జరిగింది: మట్టి శ్రీనివాసులు, మృతుని తండ్రి



ఈ రోజు నా కొడుకు లేడు. న్యాయాధికారి, పోలీసులు, న్యాయవాదుల వల్ల మాకు న్యాయం జరిగింది. వారికి పాదాభివందనం. ప్రాణం పోయినా వారిని మరచిపోలేను. నెల్లూరు నుంచి బతకడానికి నార్పలకు వచ్చాము. నార్పల సుల్తాన్‌పేటలో మాది ఒకే ఇల్లు. వారివి 400 ఇల్లు. వారి బలం తట్టుకోలేక అనంతపురం చేరినా నా కొడుకును వదిలిపెట్టలేదు. ఈ జడ్జి భగంతుడు. నాకు సాయం చేశాడు. జీవితాంతం రుణపడి ఉంటాను. ఓ కేసుంది. అది అయిపోతే నెల్లూరు చేరుకుంటాను.

రైతుల బాధలను వినండి

భూములిచ్చిన అన్నదాతలను ఆదుకోండి

జలవనరుల శాఖ మంత్రికి పరిటాల సునీత విజ్ఞప్తి

అనంతపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా రెండోదశ కాలవ లైనింగ్ పనులకు సంబంధించి తమ ప్రాంత రైతుల బాధలు, అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కలిసి వినతి పత్రం అందజేశారు. లైనింగ్ పనుల వల్ల తమ ప్రాంతంలోని చెరువులకు నీరందే అవకాశం లేదన్నారు. తద్వారా భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉందని ఆమె మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కాలువ వెంబడి ఉన్న వివిధ చెరువులు, కుంటలకు హంద్రీనీవా నీరు అందేలా తూములను ఏర్పాటు చేయాలని కోరారు. రైతులు, ప్రజలు కాలువను దాటే విధంగా వంతెనలు నిర్మించాలని కోరారు. తీవ్ర కరువు ప్రాంతమైన రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీనీవా నీరు వచ్చిన తర్వాత వ్యవసాయం చేసుకుంటున్నారని అన్నారు. హంద్రీనీవా లైనింగ్ చేపడితే కాలువ వెంబడి ఉన్న 38 చెరువులకు నీరు ఆగిపోవడం వల్ల రైతులు నష్టపోతారని అన్నారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పరిటాల రవీంద్ర అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. 2018లో భూములిచ్చిన చాలా మంది రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. రూ.14.50 కోట్లు విడుదల చేసి రైతులకు పరిహారం అందించడంతో పాటు.. ప్రాజెక్టు పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఇటీవల భారీవర్షాలకు తెగిపోయిన కనగానపల్లి చెరువు మరమ్మతుకు, నడిమి వంక రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. స్పందించిన మంత్రి రామానాయుడు.. రైతులకు పరిహారం చెల్లించేలా వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.



నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

నమ్మితే.. ముంచేశాడు

వ్యాపారిపై పోలీసులకు రైతుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతో నమ్మకంతో నిల్వ ఉంచిన ధాన్యాన్ని వారికి తెలియకుండానే గోడౌన్ యజమాని అమ్మేసుకున్నాడు. దీంతో లబోదిబోమంటూ రైతులు పోలీసులను ఆశ్రయించిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. బెళుగుప్పకు చెందిన వ్యాపారి విక్రమ్‌పై నమ్మకంతో వివిధ గ్రామాలకు చెందిన పప్పుశనగ రైతులు 2022లో అనామతు వ్యాపార లావాదేవీల్లో భాగంగా తమ పంటను ఆయన గోదాముల్లో నిల్వ ఉంచారు. అంకంపల్లి, దుద్దేకుంట, రామసాగరం, వెంకటాద్రిపల్లి రైతులు తమ పప్పుశనగ దిగుబడిని గోదాములో నిల్వ ఉంచారు. అంకంపల్లిలోనే 20 మంది రైతులు 1700 క్వింటాళ్లు అనామతిపై గోదాములో నిల్వ ఉంచారు. ఈ ఊర్లో వెంకటనాయుడు అనే రైతు ఒక్కడే 750 క్వింటాళ్లు నిల్వ ఉంచాడు. అయితే వ్యాపారి ఆయా రైతులకు తెలియకుండా సరుకంతా అమ్ముకుని కర్ణాటక ప్రాంతానికి ఉడాయించాడు. అనంతరం రైతులకు ఐపీ నోటీసులు పంపాడు. దీంతో తాము రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటను కోల్పోయి, మోసపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంకంపల్లిలోనే రూ.రెండు కోట్లపైనే మోసపోయారు. మండలంలో రూ. 3 కోట్ల నుంచి రూ. 4 కోట్ల వరకు మోసపోయినట్లు రైతులు పేర్కొన్నారు. ఈ మొత్తం ఐపీ నోటీసులు అందుకోని రైతులకు సంబంధించినది మాత్రమే. ఇంకా ఐపీ నోటీసులు అందుకున్న బాధిత రైతులకు సంబంధించి పెద్దమొత్తం ఉన్నట్లు సమాచారం.

కష్టపడి పండించినా...: రమేష్, రైతు, అంకంపల్లి



నా గోదాములో నిల్వ చేసుకోండి. ధర వచ్చినప్పుడు అమ్ముకోండి అని వ్యాపారి విక్రమ్ చెప్పాడు. అతడిపై నమ్మకంతో 2022లో 750 క్వింటాళ్ల పప్పుశనగ, 60 క్వింటాళ్ల ధనియాలు, తగ్గుపర్తి వద్ద ఉన్న శివసాయి వేర్ హౌస్‌కు తరలించాం. రేటు రాగానే అమ్ముకుందామంటే గోదాములో సరుకులేదు. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు.

తీవ్రంగా నష్టపోతున్నాం: ప్రకాష్, రైతు, అంకంపల్లి



బెళుగుప్పకు చెందిన వ్యాపారి విక్రమ్ తనకు గోదాములో వాటా ఉందని నమ్మించాడు. 78 క్వింటాళ్ల పప్పుశనగ పంట పట్టించా. డబ్బులు అడిగితే అదిగో ఇదిగోనంటూ అందుబాటులో లేకుండాపోయాడు. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతును ఇలా మోసపుచ్చే వ్యాపారులతో నష్టపోతున్నాం. కోలుకోలేకపోతున్నాం. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

డీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాల్సిందే



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు

అనంతపురం టౌన్/సెంట్రల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ అభిప్రాయాలు స్వీకరిస్తున్న వేదికపై ఆన్‌లైన్ పేకాట ఆడిన డీఆర్వో మలోలపై చర్యలు జాప్యం కావడంతో ఎస్సీ, ఎస్టీ సంఘాలు కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగాయి. కలెక్టర్‌కు విచారణ నివేదిక అందినా చర్యలు తీసుకోకపోవడంతో ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. ఆయనపై చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించడం ఏమిటని సాకే హరి నిలదీశారు. కలెక్టరేట్ వద్ద రాత్రి 9 గంటల వరకూ ధర్నా కొనసాగించారు. దీంతో ట్రైనీ డీఎస్పీ అష్రఫ్ వలి, సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ వారితో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చి, విరమింపజేశారు.

లైటింగ్ ఏర్పాటుకు అనుమతులు తీసుకోండి

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రికి ఆలయాలు, వీధుల్లో సీరియల్ లైట్ల ఏర్పాటుకు విద్యుత్తు శాఖ అనుమతులు తీసుకోవాలని ఆ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ సూచించారు. లైట్లను సురక్షితంగా ఏర్పాటు చేయడానికి ఐటీఐ విద్యార్హత, అనుభవం ఉన్న ఎలక్ట్రిషియన్స్‌ను నియమించుకోవాలన్నారు. అనుమతులు, చార్జీలు, సురక్షిత చర్యల వివరాలకు ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయాలనికి వెళ్లి తీసుకోవాలన్నారు.

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

గుంతకల్లు, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పెనుకొండ-మక్కాజీపల్లి రైల్వే సెక్షన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల వల్ల ప్యాసింజరు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. గుంతకల్లు-హిందూపురం(77213) ప్యాసింజరును ఈనెల 25 నుంచి 27 వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (77214) ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకూ రద్దు చేసినట్లు తెలిపారు. బెంగళూరు-ధర్మవరం-బెంగళూరు (06595/96) రైళ్ల ను ఈ నెల 25 నుంచి 28 వరకూ ధర్మవరం-హిందూపురం సెక్షన్‌లో రద్దు చేసి హిందూపురం-బెంగళూరు సెక్షన్‌లో నడుపుతామని తెలిపారు.

- గోరఖ్‌పూర్-యశ్వంతపూర్ (22533), అహ్మదాబాద్-యశ్వంతపూర్ (22689) రైళ్లను ఈ నెల 24న ధర్మవరం-పెనుకొండ-హిందూపురం స్టేషన్ల మీదుగా మళ్లించారు. కలబురగి-బెంగళూరు (22231) రైలును ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకూ అనంతపురం-ధర్మవరం-పెనుకొండ-యల్హంక స్టేషన్ల మీదుగా, కాచిగూడ-యశ్వంతపూర్ (20703) ఈనెల 25నుంచి 28 వరకూ, హుబ్లీ-మైసూర్ 15591), కాచిగూడ-మైసూరు (12785), నాందేడ్-బెంగళూరు (నం. 16594) రైళ్లను ఈ నెల 26 నుంచి 27 వరకూ ధర్మవరం-శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం-పెనుకొండ స్టేషన్ల మీదుగా మళ్లించనున్నారు.

చింతా కొంగలై..!



యాడికి మండలంలోని ఆదర్శ పాఠశాల సమీపాన ఉన్న వంకలోని నీటి గుంత గట్టుపై కొంగల గుంపు

మండే ఎండను లెక్కచేయక..
ఒంటి కాలిపై..
గంటల కొద్దీ చేశాం జపం..
కాసింత ఆహారం కోసం..
దొరికితే తిన్నాం..
లేదంటే పస్తున్నాం..
చెరువే ఆధారం.. ఆవాసం..
అందులో నీరుంటేనే జీవనం..
ఆ ఆశ ఇంకిపోతోంది..
కొంగలం జపం చేయగలం..
భగీరథులై తపం చేయలేం..
గంగను రప్పించనూ లేం..
ఓటర్లు కూడా కాం..
పోరాడి నీటిని తెచ్చుకోలేం..
ప్చ్.. ఏం చేయగలం..?
ఈ వేసవి ఎలా నెట్టుకురాగలం?

- ఆంధ్రజ్యోతి, యాడికి

క్రైం కార్నర్ | క్రషర్‌లో పడి యువకుడి మృతి



సురేంద్ర (ఫైల్)

గుత్తిరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండంలోని జ క్కలచెరువు గ్రామ సమీపాన సోమవారం ప్రమాదవశాత్తు క్రషర్‌లో పడి యువకుడు సురేంద్ర(34) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన సురేంద్ర క్రషర్ మిషన్‌లో పనికెళ్తుండేవాడు. సోమవారం మధ్యాహ్నం పనిచేస్తుండగా మిషన్‌లో రాళ్లు అడ్డు పడడంతో వాటిని తీయడానికి వెళ్లాడు. అక్కడ మిషన్‌లోకి వచ్చే రాళ్లు ప్రమాదవశాత్తు సురేంద్ర మీద పడ్డాయి. తోటి కూలీలు రాళ్లు తొలగించేలోపు అతడు మరణించాడు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సురేంద్రకు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు



అంజప్ప (ఫైల్)

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చెరుకూరు సమీపంలో సోమవారం ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో టీడీపీ నాయకుడు అంజప్ప(58) మృతిచెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. రొద్దం ఏఎ్‌సఐ నాగరాజు తెలిపిన మేరకు.. పెద్దమంతూరు రొప్పాల గ్రామానికి చెందిన అంజప్ప పని నిమిత్తం ద్విచక్రవాహనంలో కర్ణాటకలోని వెంకటాపురం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. చెరుకూరు వద్దకు రాగానే అదే ఊరికి చెందిన కిరణ్ ద్విచక్రవాహనంలో అంజప్ప బైక్‌ను వెనుకనుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో అంజప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. కిరణ్‌తోపాటు వెనుక కూర్చున్న ఈశ్వరమ్మ గాయపడ్డారు. అంజప్పకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి.. అంజప్ప కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

జోరుగా కంది కొనుగోళ్లు



కందులను విక్రయిస్తున్న రైతులు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో కంది కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మార్క్‌ఫెడ్, వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి మండలంలో కంది కొనుగోలు ప్రారంభించారు. క్వింటా రూ.7550 ధరతో కొనుగోలు చేస్తున్నారు. రాచానపల్లి, చియ్యేడు సహకార పరపతి సంఘాల్లో కంది కొనుగోళ్లు చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా 844 మంది రైతులు కంది పంట విక్రయాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈనెల 22వ తేదీ వరకు 527 మంది రైతులు పంటను విక్రయించుకున్నారు. చియ్యేడు సహకార పరపతి సంఘంలో 341 మెట్రిక్ టన్నులు, రాచానపల్లిలో 193 మెట్రిక్ టన్నుల కందులను రైతులు విక్రయించారు. పీఏసీఎస్‌లో కందుల కొనుగోలు అనంతరం అవి గోదాముకు చేరిన తరువాత రైతులకు డబ్బు చెల్లిస్తారని అధికారులు చెబుతున్నారు.

మోసగిస్తే క్షమించేది లేదు: విజిలెన్స్ డీజీ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో మోసాలకు పాల్పడితే క్షమించేది లేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీష్ కుమార్ గుప్తా హెచ్చరించారు. సోములదొడ్డి, సనప సమీపంలోని పెట్రోల్ బంకుల్లో మోసాలపై జిల్లా అధికారుల నుంచి డీజీ కార్యాలయానికి నివేదిక అందింది. దీంతో ఆయన సీరియస్ అయ్యారు. సామాన్యులపై ప్రభావం చూపేలా మోసగించేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ సోమవారం ప్రకటన విడుదల చేశారు. సోములదొడ్డి సమీపంలోని శ్రీవిజయలక్ష్మి ఆటోకేర్ పెట్రోల్ బంక్‌లో చిప్‌ను వినియోగించి డీజిల్ దోచుకుంటున్న విషయం లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బయటపడిన విషయం తెలిసిందే. ఆత్మకూరు మండలంలోని సనప గ్రామం వద్ద ఉన్న పెట్రోల్ బంకులో శనివారం దాడులు నిర్వహించారు. అధికారులు గుర్తించలేని స్థాయిలో అత్యాధునిక చిప్‌ను అమర్చి, పెట్రోల్‌ను దోచుకుంటున్నట్లు విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలను కొనసాగించాలని విజిలెన్స్ డీజీ ఆదేశించారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం..!

కమ్మూరు ఉన్నత పాఠశాలలో ఆగిపోయిన పనులు

- విద్యార్థులకు తప్పని తిప్పలు
- తాగడానికి బోరు నీరే దిక్కు



గదుల నిర్మాణం కోసం ధ్వంసం చేసిన గదిపైన గోడలు

కూడేరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నిధులు సిద్ధంగా ఉన్నా.. నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనులు అటకెక్కాయి. మండలంలోని కమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌ల నిర్మాణ అర్ధంతరంగా ఆగిపోయింది. అదనపు తరగతి గదుల పనులు మొదలవనేలేదు. దీంతో విద్యార్థినీవిద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారు తాగడానికి శుద్ధి నీరు కూడా లేదు. బోరు నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు.

నిధులున్నా..

కమ్మూరు ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 90 మంది విద్యార్థులుచదువుకుంటున్నారు. గత ప్రభుత్వం రెండో విడత నాడు-నేడు కింద పాఠశాలల్లో వివిధ రకాల అభివృద్ధి పనులకు రూ.28 లక్షలు మంజూరు చేసింది. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లతోపాటు వంటగది తదితర పనుల నిర్మాణం చేపట్టారు. దాదాపు రూ.21 లక్షల వరకు నిధులు ఖర్చు చేసినా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం రూ.7 లక్షల వరకు నిధులున్నాయి. ఉన్న నిధులతో ఆగిపోయిన పనులను పూర్తి చేయవచ్చు. ప్రభుత్వం మారడంతో పాఠశాలకు నూతనంగా తల్లిదండ్రుల కమిటీ ఎంపిక చేశారు. అధికారులు కూడా ఆగిపోయిన పనులపై దృష్టి పెట్టలేదు. ఆగిపోయిన పనులను పూర్తి చేయాలని పాఠశాల చైర్మన్ పల్లకి ఎర్రిస్వామి, కమిటీ సభ్యులు పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. నిధులున్నా.. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు, వంటగది తదితర పనులు అసంపూర్తిగా ఉన్నాయి.



అర్ధంతరంగా నిలిచిపోయిన మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌ల నిర్మాణం

బోరు నీరే దిక్కు

పాఠశాలలో విద్యార్థులకు బోరు నీరే దిక్కయింది. మధ్యాహ్న భోజనం వండడానికి కూడా బోరు నీరు వినియోగిస్తున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న పాఠశాలలో శుద్ధి నీటి వసతి లేకపోవడంతో మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు బోరు నీటితో దాహం తీర్చుకుంటున్నారు. నాడు-నేడు కింద సరఫరా చేసిన శుద్ధి చేసే మిషన్ అమర్చకపోవడంతో నిరుపయోగంగా ఉంది. గతంలో పలువురు విద్యార్థులు పాఠశాలలో బోరు నీరు తాగి, అస్వస్థతకు లోనైనట్లు తెలిసింది.

అటకెక్కిన అదనపు గదుల నిర్మాణం

కమ్మూరు ఉన్నత పాఠశాలలో మూడు అదనపు తరగతి గదులను మంజూరు చేశారు. ఒక్కో గది నిర్మాణానికి రూ.13 లక్షలు చొప్పున రూ.39 లక్షలు విడుదల చేశారు. అప్పట్లో వైసీపీ నాయకులు ఆగమేఘాల మీద పాఠశాల పైభాగంలో అదనపు గదుల నిర్మాణానికి పాఠశాల పైన గోడలను ధ్వంసం చేశారు. అంతలోనే మంజూరైన నిధులు వెనక్కి వెళ్లాయని అధికారులు చల్లగా చెప్పారు. గదుల నిర్మాణ పనులు చేయడానికి ధ్వంసం చేసిన పాఠశాల గదిపైన గోడలతోపాటు పిల్లర్లు అలాగే వదిలేశారు. ఈ నేపథ్యంలో వర్షాలు కురిస్తే గోడల నుంచి వర్షపు నీరు గోడల్లోకి వెళ్లి, పాఠశాల గదులు దెబ్బతినే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం

పాఠశాలలో నాడు-నేడు రెండో విడత కింద పలు అభివృద్ధి పనులకు రూ.28 లక్షలు మంజూరయ్యాయి. అందులో వివిధ రకాల పనులు చేశారు. ప్రస్తుతం రూ.7 లక్షల నిధులున్నాయి. వాటితో ఆగిపోయిన పనులు చేయడానికి నూతన కమిటీ సభ్యుల పేరున బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంది. త్వరలోనే అకౌంట్ ఓపెన్ చేసి, పనులు పూర్తి చేస్తాం.

-రవిశంకర్, పాఠశాల హెచ్‌ఎం

వదలని పీడ..!

- వరి పంటలో చీడపీడల ఉధృతి
- వంకమద్ది చెరువు కింద వందల ఎకరాల సాగు
- నెలరోజుల పైరుకే ఎర్ర, తెల్ల చీడ
- ఆందోళనలో అన్నదాతలు



ఆయకట్టులో సాగు చేసిన వరి పంట



పంటకు సోకిన ఎర్రచీడ

నంబులపూలకుంట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చీడపీడల ఉధృతితో రబీలో సాగు చేసిన వరి పంట దెబ్బతింటోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వంకమద్ది చెరువు ఆయకట్టు కింద 365 ఎకరాల సాగుభూమి ఉంది. రబీలో మూడువందల ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు. నంబులపూలకుంట, వంకమది, మరికొమ్మెదిన్నె పంచాయతీ గ్రామాల రైతులకు ఇక్కడ భూములున్నాయి. ఒకసారి చెరువు నిండితే రెండు పంటలు సాగుచేసే అవకాశముంది. వర్షాకాలంలో కురిసిన వర్షాలకు సగం చెరువు నిండింది. ఈ చెరువుకు రెండు తూములున్నాయి. చెరువు పూర్తిగా నిండితే పెద్దతూముకింద కాలువలకు నీరు అందిస్తారు. ప్రస్తుతమున్న నీటి సామర్థ్యాన్ని బట్టి చెరువులో ఉన్న కింద తూము ద్వారా పంటలకు నీరు అందిస్తున్నాయి. ఆయకట్టు రైతులందరూ చర్చించుకుని, పంట సాగుకు నీరున్నాయని వరి పంటను సాగుచేశారు. వరి నాటి 30రోజులు గడుస్తోంది. కలుపు దశలో వరిపంటకు ఎర్ర, తెల్లచీడ సోకింది. కొనముడతపురుగు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండలు ముదురుతున్న సమయంలో వేడికి చీడ పీడలు సోకవనుకుంటే, అవి పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండ మరింత ముదిరితే అగ్గి తెగులు సోకే అవకాశం ఉన్న ట్లు వాపోతున్నారు. ఆయకట్టు వరి పంటలకు మందులు పిచికారీ చేయాలంటే, గట్లు చిన్నవిగా ఉంటాయి. భూములు అనుకుని ఉండటంతో ఒక పంటనుంచి మరోపంటకు చీడపీడలు వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. రైతులందరూ మూకుమ్మడిని చీడపీడల నివారణకు మందులు పిచికారీ చేయాల్సి ఉంది.

ఆయకట్టు సాగు

వంకమద్దిచెరువు ఆయకట్టు కింద ఒకసారి వరి పంట పండితే ఏ రైతు ఇంటిలో చూసినా తిండిగింజలకు లోటులేకుండా ఉంటుంది. నంబులపూలకుంట, వంకమద్ది, గురుకానివారిపల్లి, పెద్దరామయ్యగారిపల్లి, బందారచెట్లపల్లి, పోరెడ్డివారిపల్లి, గెలిచివారిపల్లి, మరికొమ్మెదిన్నె, నల్లగుట్లపల్లి గ్రామాలరైతులకు ఆయకట్టు కింద భూములున్నాయి. గత కొన్నేళ్లుగా వంకమద్దిచెరువు ఆయకట్టు కింద పంటల సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ భూమి లేని రైతులు కౌలుకు, గుత్తకు తీసుకుని వరి పంటను సాగు చేస్తున్నారు. ఎకరాకు 30నుంచి 40 బస్తాల దాకా దిగుబడి ఇచ్చే భూములు కావడంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎంతో ఆశతో సాగుచేసిన వరి పంటకు నెలలోనే చీడపీడలు ఉధృతంగా ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడుకునేందుకు వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

మందులు పిచికారీ చేయాలి: లోకేశ్వర్‌రెడ్డి, వ్యవసాయాధికారి

వరి పంటకు సోకిన చీడపీడల నివారణకు ఆలస్యం చేయకుండా రసాయన మందులు పిచికారీ చేయాలి. ఒకలీటర్ నీటికి 2గ్రా. ఆసిఫేట్ లేదా రెండువందల లీటర్ల నీటిలో బ్యాక్టిరియోమైసిన్ 36గ్రా.కలిపి పిచికారీ చేస్తే చీడపీడలను నివారించవచ్చు.

ఎర్రచీడ పట్టింది: నరసింహులు, వంకమద్ది



ఆయకట్టు కింద 80సెంట్ల విస్తీర్ణంలో వరి పంటను సాగుచేశా. ప్రసుత్తం కలుపు దశలో ఉంది. ఉదయం సమయంలో వరి పంటను పరిశీలిస్తే పచ్చగా కనిపిస్తుంది. చీడ, దోమలు కనిపించవు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పంటను పరిశీలిస్తే ఎర్రమచ్చతెగుళ్లు బాగా కనిపిస్తాయి. నెల కిందట సాగు చేసిన పంటకు వ్యాధి సోకింది. వ్యవసాయాధికారులు ఏమందులు పిచికారీ చేయాలో తెలపాలి.

ఏమి చేయాలో..: నరసింహులు, వంకమద్ది



ఎకరం పొలంలో రూ. 30వేలు ఖర్చు చేసి వరి పంటను సాగు చేశా. ఆయకట్టు కింద పంట బాగా పండితే ఎకరానికి 30నుంచి 40బస్తాలు పండుతాయి. వరి నాటి నెలదాటకనే రోగాలు ఆశించాయి. చీడపీడలు నివారించుకుని పంటను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. వేసవి కాలంలో వరి పంటకు చీడపీడలు వస్తున్నాయంటే ఏమిచేయాలో అర్థం కావడంలేదు.

పది ఫలితాల్లో బీసీ హాస్టళ్లను టాప్‌లో నిలపడమే లక్ష్యం

- బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారీ



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ సంక్షేమ వసతిగృహాల్లోని పదో తరగతి విద్యార్థులను ఈ ఏడాది ఫలితాల్లో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పెట్టుకున్నామని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూ కొఠారీ అన్నారు. అందుకోసం ఇప్పటికే యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని, చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి విద్యార్థి పాసయ్యేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామంటున్న ఆమెతో ఇంటర్వ్యూ...

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రశ్న: వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

జవాబు: జిల్లాలోని అన్ని వసతిగృహాల్లో శుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నాం. పిల్లలకు అందించే భోజనం నాణ్యత విషయంలో రాజీ పడొద్దని వార్డెన్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం.

ప్రశ్న: పదో తరగతిలో వెనుకబడిన స్టూడెంట్స్ పరిస్థితేంటి..?

జవాబు: పదో తరగతిలో ఏ, బీ, సీ గ్రేడ్‌ల వారీగా విద్యార్థులను పరిశీలిస్తున్నాం. అందులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. వారికోసం ఇద్దరు, ముగ్గురు ట్యూటర్లను పెట్టి సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇస్తున్నాం.

ప్రశ్న: కొందరు వార్డెన్లు పిల్లలకు అరకొర భోజనం పెడుతున్నారన్న విమర్శలున్నాయి..?

జవాబు: జిల్లాలో విద్యార్థులకు మెనూ అమలు పరిచే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని ఇప్పటికే వార్డెన్లకు ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడైనా మెనూలో అలసత్వం వహించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవు.

ప్రశ్న: జిల్లాలో ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్) పనితీరు ఎలా ఉంది?

జవాబు: జిల్లాలో గతేడాదే ఎఫ్‌ఆర్‌ఎస్ కోసం కొన్ని హాస్టళ్లను పైలట్‌గా తీసుకున్నాం. ఇప్పటి వరకూ 70 శాతం వరకూ సక్సెస్ ఫుల్‌గా సాగుతోంది. ఈ సంవత్సరం అన్ని హాస్టళ్లలో అమలు చేస్తున్నాం.

ప్రశ్న: సొసైటీ లోన్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయా..?

జవాబు: ప్రస్తుతం సొసైటీ లోన్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేపట్టడం లేదు. రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు వస్తే.. కార్పొరేషన్ సహకారంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతాం.

సీపీఎం నేత బడా సుబ్బిరెడ్డి కన్నుమూత

- కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు
- నివాళి అర్పించిన నాయకులు



సుబ్బిరెడ్డి (ఫైల్)

కదిరి అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నేత బడా సుబ్బిరెడ్డి (66) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. అనారోగ్యంతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ మృతిచెందారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన కదిరి మండలంలోని వరిగిరెడ్డిపల్లికి తీసుకొచ్చారు. పలువురు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సుబ్బిరెడ్డి మృతి కమ్యూనిస్టు ఉద్యమలకు తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ తదితరులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుబ్బిరెడ్డి మృతి సీపీఎంకు, రైతు సంఘానికి తీరని లోటని అన్నారు. సుదీర్ఘకాలంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అనేక ఉద్యమాలు కొనసాగించారని గుర్తు చేసుకున్నారు. సీపీఎం సత్యసాయి జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడిగా, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నట్లు తెలిపారు. మృతుడి కు టుంబాన్ని పలువురు పరామర్శించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శులు కేశవరెడ్డి, కదిరప్ప, సీపీఎం నాయకు డు జీఎల్ నరసింహులు, పలువురు నాయకులు నివాళి అర్పించారు.



మృతదేహంపై పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న జిల్లా నాయకులు

చచ్చినా.. మారరు..!

అనంతపురం విద్య, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తన కుమారుడి మార్కుల జాబితా కోసం తండ్రి ఆత్మహత్య చేసుకోబోయాడు. చావుకు సిద్ధపడితేగానీ యాజమాన్యం స్పందించలేదు. నగర శివారులోని ఓ కార్పొరేట్ పాఠశాల వద్ద సోమవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. కంబదూరు మండలం రాళ్లపల్లికి చెందిన శ్రీనివాస్ కుమారుడు గత ఏడాది ఓ కార్పొరేట్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్నాడు. ఫీజు పెండింగ్ ఉందంటూ అప్పట్లో ఏడాది టీసీ మాత్రమే ఇచ్చి, మార్కుల జాబితా ఇవ్వలేదు. ఏడాదిగా తిరుగుతున్నా కరుణించలేదు. ఇటీవల రాయదుర్గంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల వేదికలో డీఈఓ ప్రసాద్‌బాబుకు శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో ఆయన పురుగుల మందు డబ్బాతో పాఠశాల ఆవరణలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకోబోయారు. పాఠశాల సిబ్బంది ఆయనను అడ్డుకుని పక్కకు తీసుకెళ్లారు. ఆ తరువాత మార్కుల జాబితాను ఇచ్చి పంపినట్లు తెలిసింది.

చీనీ టన్ను రూ.22వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,050 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.11,500తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 169 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

న్యూస్ బాక్స్


ప్రతిష్ఠించిన శివలింగం


హోమం నిర్వహిస్తున్న పండితులు

ఘనంగా శివలింగ ప్రతిష్ఠ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయపల్లి కాలనీ చెరువు మరవ వద్ద కొత్తగా నిర్మించిన శివాలయంలో సోమవారం ఘనంగా శివలింగ, బసవేశ్వర విగ్రహాలను ప్రతిష్ఠించారు. పురోహితులు పంచరత్న సురేష్‌శర్మ, మహేష్ గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు.

కాలభైరవ స్వామి విగ్రహం...



ధర్మవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక రేగాటిపల్లి రహదారి పక్కన కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గంగపూజ, యాగశాల ప్రవేశం, జలదివాసం, అనుపూజా కార్యక్రమాల అనంతరం గణపతి, నవగ్రహ, రుద్ర, దీక్ష, సుదర్శన హోమాలను వేదపండితులు నిర్వహించారు.

ధ్వజస్తంభం...


హోమం నిర్వహిస్తున్న పురోహితులు

నల్లమాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక నాగలకట్ట వద్ద ఉన్న శివాలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇటీవల రెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కనుముక్కల లక్ష్మణ కుటుంబ సభ్యులు ధ్వజస్తంభం ఏర్పాటుకు రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా సోమవారం మొదట పురోహితులు గణపతిపూజ, హోమం నిర్వహించి, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు.

కొనసాగిన యజ్ఞం


యజ్ఞాన్ని నిర్వహిస్తున్న పండితులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో 11వ రోజైన సోమవారమూ అతిరుద్ర మహా యజ్ఞం కొనసాగింది. వేదపడింతులు మహాగణపతితో యజ్ఞాన్ని కొనసాగించారు. శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. యజ్ఞంలో సర్వదేవతా అర్చన చేశారు. సాయంత్రం గౌరీశంకర వివాహ కార్యక్రమాన్ని సంగీత కచేరి ద్వారా నిర్వహించారు. ప్రముఖ సంగీత గాయకులు కార్తీక్, జ్ఞానేశ్వర్ భగవతార్ బృందం మధుర గానంతో భక్తులను అలరింపచేశారు. అనంతరం సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమునాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎప్పుడు కూలునో..!

పైపెచ్చు భయం

- శిథిలావస్థలో విద్యుత్ ఏఈ కార్యాలయం
- ఊడిపడుతున్న పెచ్చులు
- సచివాలయాల పరిస్థితీ అంతే..




శిథిలావస్థలో ఉన్న విద్యుత్ ఏఈ కార్యాలయం, పెచ్చులు ఊడి కడ్డీలు కనిపిస్తున్న సన్‌షేడ్ (ఇన్‌సెట్‌లో..)

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ శాఖ సబ్ స్టేషన్‌లోని ఏఈ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులు ఊడి పడుతున్నాయి. గత్యంతరంలేక ఉద్యోగులు భయం.. భయంగానే విధులు నిర్వహిస్తున్నారు. ఏఈ కార్యాలయంతో పాటు ఆపరేటర్ గది కూడా పెచ్చులు ఊడి కడ్డీలు కనిపిస్తున్నాయి. ఈ కార్యాలయం చుట్టూ ఉన్న సన్‌షేడ్ కూడా పెచ్చులు ఊడి.. నేడో రేపో కూలేలా ఉంది. విద్యుత్ బిల్లులు చెల్లించే వినియోగదారులు భయం భయంగా సన్‌షేడ్ చూస్తూ బిల్లులు చెల్లిస్తున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణంలో సిబ్బంది కోసం నిర్మించిన క్వాటర్స్ కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది అద్దె ఇళ్లలో నివాసముంటున్నారు.

● సచివాలయాలూ అంతే..

ఓడీ చెరువు 1,2 గ్రామ సచివాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో.. ఎస్సీ హాస్టల్‌లోని గదుల్లో నిర్వహిస్తున్నారు. ఆ గదులు కూడా శిథిలావస్థకు చేరి.. పెచ్చులు ఊడి పడుతున్నాయి. గోడలు కూడా దెబ్బతిన్నాయి. అయినా తప్పని పరిస్థితుల్లో సిబ్బంది ఆ గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల భవనాలను కూల్చి.. నూతన భవనాలు నిర్మించేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఓడీసీ గ్రామ సచివాలయం

ప్రజాసమస్యలపై అదే నిర్లక్ష్యం

కార్యక్రమానికి అధికారుల డుమ్మా

తనకల్లు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంపై అధికారులు అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో తూతూ మంత్రంగా ఈ కార్యక్రమాన్ని చేతులు దులిపేసుకొంటుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో అసలు అధికారులు ఈ కార్యక్రమానికే హాజరుకావడం లేదు. తనకల్లు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఒక్క తహసీల్దార్ శోభాసువర్ణమ్మ తప్ప మిగిలిన ఏశాఖాధికారీ హాజరుకాలేదు. ఇలా మండలస్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి గైర్హాజర్ అవుతున్నా.. ఉన్నతాధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం ప్రజా సమస్యల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.

● జిల్లా పోలీసు కార్యాలయంలో..

పుట్టపర్తిరూరల్ : జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ విజయ్‌కుమార్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 58 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, ఎస్బీఎస్సై ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

● పేదలకు మాత్రమే నోటీసులా?

తనకల్లు మండలం బొంతపల్లి సర్వేనెంబర్ 183లో బాగా ధనవంతులకు పట్టాలు మంజూరు చేశారు. 182 సర్వేలో దళితులకూ పట్టాలు ఇచ్చారు. పేదలతో పాటు ధనవంతులూ ఆ భూమిని సాగులోకి తీసుకురాలేదు. అయితే ఆ భూమిని ఎందుకు భూమి సాగుచేయలేదో చెప్పాలని దళితులకు మాత్రమే రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ధనికులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేసి.. పేదలకే కేటాయించాలి. లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం' అని బొంతపల్లి గ్రామస్థులు తహసీల్దార్ శోభాసువర్ణకు ఫిర్యాదు చేశారు.



తనకల్లు: ఖాళీగా ఉన్న కుర్చీలు

● చేనేతలను ఆదుకోవాలి

ధర్మవరం: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.2వేల కోట్లు కేటాయించాలని ఏపీ చేనేత కార్మికసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలా లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ మహేశ్‌కు వినతి పత్రం అందజేశారు.

● స్థలాన్ని కేటాయించాలి

శ్రీసాయిరూరల్ విభిన్న ప్రతిభావంతుల మండల సమాఖ్యకు 10సెంట్లు స్థలాన్ని కేటాయించాలని ఆ సంఘం అధ్యక్షురాలు కాంతమ్మ, సెక్రటరీ నల్లప్ప ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు.

● భూ సమస్యలు పరిష్కరించాలి

నల్లమాడ: రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ రంగనాయకులకు మండల రైతు సంఘం నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, గంగాధర్, కుచ్చెపు చంద్ర వినతి పత్రం అందజేశారు.

● జనసేన పార్టీకి స్థలం కోసం..

గాండ్లపెంట : మండల కేంద్రంలో జనసేన పార్టీ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్ బాబురావుకు వినతిపత్రం అందచేశారు. ఇందులో జనసేన నాయకులు రామమోహన్, రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.


నమూనాను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ముదిగుబ్బ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్వభారతి పాఠశాలలో సోమవారం విద్యార్థులు సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. వారు తయారు చేసిన పలు నమూనాలను ప్రదర్శించారు. మొదటి, ద్వితీయ, తృతీయ ప్రదర్శనలను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. అంతే కాకుండా సైన్స్ నమూనాలు తయారు చేసిన ప్రతి విద్యార్థికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వేమనారాయణ, విశ్వభారతి పాఠశాల కరస్పాండెంట్ సింగారెడ్డి, డైరెక్టర్ చంద్రహాస్‌రెడ్డి, చంద్రశేఖర్, సాయినాథ్‌రెడ్డి, బాలాజీకుమార్, చిందంబరరెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ విజేత ధర్మవరం

ధర్మవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్డీటీ బాస్కెట్‌బాల్ పోటీల్లో ధర్మవరం బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచినట్టు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోషియేషన్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. అండర్-15 విభాగంలో జరిగిన బాలికల ఫైనల్స్ పోటీల్లో బుక్కరాయసముద్రం జట్టుతో తలపడి విజేతగా నిలిచింది. అలాగే బుక్కరాయసముద్రం బాలుర జట్టుతో కూడా తలపడి విజేతగా నిలిచింది. దీంతో విజేతలను సోమవారం ధర్మవరంలో జిల్లాసెక్రటరీ, ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేంద్ర, రమేశ్‌బాబు అభినందించారు.


విజేతలతో సంఘం ప్రతినిధులు


విద్యార్థులకు బహుమతులు అందజేసిన సిబ్బంది

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

ధర్మవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ జూనియర్ కళాశాలలో సోమవారం సరస్వతి పూజను విద్యార్థినులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సరస్వతి అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 420 పైగా మార్కులు సాధించిన 46 మంది విద్యార్థులకు వాసవీ బాలుర, బాలికల కళాశాల ప్రిన్సిపాళ్లు భాస్కర్ రెడ్డి ఈశ్వరయ్య బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పేదలకు ఇంటి పట్టాల కోసం 3న ధర్నా

గాండ్లపెంట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పేదలందరికి ఇంటిపట్టాలు మంజూరు చేయాలని వచ్చే నెల 3న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కదిరప్ప తెలిపారు. మండలంలోని రెక్కమానులో సోమవారం నిర్వహించిన ఇంటింటా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో అధిక సంఖ్యలో పేదలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ కేశవరెడ్డి, కార్మిక సంఘం నాయకులు ఈశ్వరయ్య, కొండయ్య, ఆదినారాయణ, వెంకటనారాయణ, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

ముగిసిన రాయలసీమ నృత్యోత్సవాలు


ముగింపు వేడుకల్లో పాల్గొన్న కళాకారులు

ధర్మవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాయలసీమ నృత్యోత్సవ వేడుకలు సోమవారంతో ముగిశాయి. ఈ వేడుకలలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్, ప్రముఖులు గోవిందచౌదరి, పుల్లయ్య, కలవల మహేశ్ హాజరై పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.

బోరు ఏర్పాటు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తాము తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని కప్పలబండ గ్రామస్థులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాగ్రీవెన్సులో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బోరు, మోటార్, పైప్‌లైన్ ఏర్పాటుకు రూ. 5.50 లక్షలను ఎమ్మెల్యే విడుదల చేశారు. కప్పలబండలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంలో భాగంగా ఆదివారం మామిళ్ళకుంట కూడలిలోని బోరు వేయగా.. పుష్కలంగా నీరు పడ్డాయి.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 5 కోట్లతో ఉపాధి హామీ పనులు చేపట్టారు. ఆ పనులను ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృంద సభ్యులు పరిశీలించారు. రూ.50 వేలు అవినీతి జరిగినట్లు గుర్తించారు. ఆ వివరాలను సోమవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో వివరించారు. ఆ అవినీతి సొమ్మును సంబంధిత ఉపాధిహామీ సిబ్బంది నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. ఇందులో ఎంపీపీ రమణారెడ్డి, జడ్పీటీసీ లక్ష్మీనరసమ్మ, ప్రొసీడింగ్ అధికారి శివశంకర్ పాల్గొన్నారు.

ఉపాధి.. ఉపవాసం..!

- ఆరు వారాలుగా అందని కూలి
- ఇబ్బందుల్లో కూలీలు
- కుటుంబ పోషణ భారమై.. అప్పులపాలు
- శివరాత్రికైనా అందేనా అని ఎదురు చూపులు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు ఆరు వారాలుగా కూలి డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణకు అప్పులు చేస్తూ.. కాలం వెళ్లదీస్తున్నారు. కదిరి నియోజకవర్గంలో 38,366 జాబ్‌కార్డులున్నాయి. 69,172 మంది కూలీలున్నాయి. వీరిలో చాలా మందికి కూలి డబ్బులు వస్తేగాని.. పూట గడవని పరిస్థితి. అలాంటి వారికి ఆరు వారాలుగా కూలి డబ్బులు అందకపోవడంతో.. అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు.

● కూలి ఇస్తేనే పండగ :

కదిరి నియోజకవర్గంలో వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు చాలా మంది ఉన్నారు. కానీ నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా చాలా మంది ఉపాధి కోల్పోయారు. కొద్దిగా చదువుకున్న వారు ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. చదువుకోని వారు ఉన్న ఊరిలోనే ఉపాధి పనులకు వెళ్తున్నారు. అయితే ఆరు వారాలుగా కూలి చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శివరాత్రి పండుగకైనా కూలి డబ్బులు వస్తాయో అని ఆశగా ఎదురుచూస్తున్నారు.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఆందోళన వద్దు..

ఉపాధి కూలీలు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఆరువారాలకు గాను ఒక వారం కూలి డబ్బులు కొంతమందికి జమ అయ్యాయి. పెండింగ్ వేతనాల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తా. ప్రభుత్వం కరువు మండలాల్లో ఉపాధి పనిదినాలను 150రోజులకు పెంచింది. ఈ అవకాశాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలి.

-రమేష్‌బాబు, డ్వామా ఏపీడీ, కదిరి క్లస్టర్

అధికారులు స్పందించాలి



సొంతూరులోనే ఉపాధి పనులకు వెళ్తున్నా. ఆరు వారాలుగా డబ్బులు చెల్లించలేదు. కూలి సొమ్ము వస్తేనే కుటుంబ పోషణ. అధికారులను అడిగితే మాకు తెలీదంటున్నారు. ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు. అధికారులు స్పందించాలి.

-గంగులప్ప, మొటుకుపల్లి

ఎలా బతకాలి..?

ఉపాధి పనులు చేశాను. అయినా కూలి ఇవ్వలేదు. ఇలా ఆరువారాలైంది. ఇంతవరకు కూలి డబ్బులు ఇవ్వకపోతే మేం ఎలా బతకాలి. డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాం. శివరాత్రి పండుగకైనా డబ్బులు ఇస్తారో... లేదో...



-లక్ష్మమ్మ, మొటుకుపల్లి

వలస కూలీ మృతి

నల్లమాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాస్మవారిపల్లి గ్రామానికి చెందిన వలస కూలి రాజారెడ్డి (38) గుండెపోటుతో ఆదివారం రాత్రి మరణించాడు. మూడేళ్ల క్రితం బెంగుళూరు వెళ్లి.. కూలి పనులు చేసుకొంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆదివారం రాత్రి గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు చెప్పారు. రాజారెడ్డి మృతదేహాన్ని స్వగ్రామమైన బాస్మవారిపల్లి సోమవారం తీసుకొచ్చారు. మృతదేహానికి నివాళులర్పించిన నల్లమాడ సర్పంచ్ రమావత్ భారతి భర్త చాప్లానాయక్.. బాధిత కుటుంబానికి రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందజేశారు. రాజారెడ్డికి భార్య నాగేశ్వరమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఘనంగా గాడ్గే బాబా జయంతి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగమ్మ దోబీఘాట్ వద్ద సంత్ గాడ్గే బాబా జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. కులవివక్ష, అంటరానితనం రూపు మాపడానికి ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో బహుజన ప్రజా పరిరక్షణ సమితి, రజక సంఘం నాయకులు నాగభూషణ, నాగేంద్ర, హనుమంతు, సుబ్బు, నరసింహులు, శ్రీనివాసులు, సలీం, జాకీర్‌హుస్సేన్, కెఆర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పండుగ సందర్భంగా ఎన్పీకుంట మండలంలో గూటిబైలు వద్ద వెలసిన తిమ్మమ్మ మర్రిమానుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ మైనోద్దీన్ సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 7 నుంచి గురువారం సాయంత్రం వరకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. రాయచోటి నుంచి ఐదు, కొక్కంటి క్రాస్ నుంచి ఐదు, కదిరి నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు ఉంటుందన్నారు.

దక్షిణకాశీ.. కాశీవిశ్వేశ్వరాలయం

- విద్యారణ్యస్వామి ప్రతిష్ఠించిన శివలింగం
- శిల్పకళాశోభితంగా విరాజిల్లుతున్న ఆలయం
- రేపటి నుంచి శివరాత్రి ఉత్సవాలు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

పెనుకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్య రెండో రాజధానిగా వెలుగొందిన పెనుకొండ నాటి రాజుల కాలంలో 365 దేవాలయాలతో టెంపుల్‌టౌన్‌గా ప్రసిద్ధి చెందింది. అందులో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం ఒకటి. దక్షిణ కాశీగా నేటికీ విరాజిల్లుతోంది.

శిల్పకళాశోభితం: శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఆలయాన్ని నిర్మించి ఉంటారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ముఖద్వారం గోడలపై విజయనగర రాజుల రాజచిహ్నం అయిన పిడిబాకు, అర్ధచంద్రుడు, సూర్యుడు, వరాహబొమ్మలు చెక్కబడి ఉన్నాయి. ఆలయం వెలుపల గోడలపై హరవిలాసం కుమారసంభవం, శ్రీకృష్ణదేవరాయల శ్రీకాళహస్తి మహత్యం దృశ్యకావ్యాలను చెక్కబడి ఉన్నాయి. ఆలయం ముఖ ద్వారం ముందు నంది విగ్రహం లేపాక్షి నంది విగ్రహాన్ని పోలి ఉంటుంది. కాలి గిట్టలు, మెడ పట్టీలు, గజ్జలు, గంటలు, అన్ని అలంకారాలు దర్శనమిస్తాయి. గుడిలోపల అడుగుపెట్టగానే కల్యాణమండప వైభవం దేవేంద్ర సభను తలపిస్తూ భక్తులను అమితంగా ఆకట్టుకుంటుంది. విజయనగర శిల్పరీతుల్ని తలపిస్తుంది. సప్తస్వరాలు పలికే స్తంభాలు, అభినయించే అప్సరస గణాలు సామగానం చేసే గాంధర్వులు, నృత్యగానం చేసే నాట్యమణులు, అతిలోక సర్వాంగ సుందరంగా విరాజిలుతున్నాయి. గర్భగుడి ఎదురుగా మహానంది, ద్వారానికి ఇరువైపులా దుర్గాదేవి, దక్షిణామూర్తి, వీరభద్రుడు, భైరవుడు, కుమార, వినాయకుడు, త్రిపురార్తక మూర్తి విగ్రహాలు దర్శనమిస్తాయి. గర్భగుడి గోడలమీద, స్తంభాలపై శివలీలు, కిరాతకార్జునీయం అర్జునుని తపస్సు, శివపార్వతుల కిరాతక వేషధారణలు అర్జునుడికి పాశుపతాస్త్రం ప్రదానం చేయడం వంటి దృశ్యాలు కళ్లకు కట్టినట్లు చెక్కబడి ఉన్నాయి.



ఆలయం వెలుపల కల్యాణ మండపం

శివలింగాన్ని ప్రతిష్ఠించిన విద్యారణ్య స్వామి: శివాలయంలోని గర్భగుడిలోని మూల విగ్రహాన్ని విజయనగర రాజుల రాజగురువు విద్యారణ్యస్వామి స్వయంగా ప్రతిష్ఠించినట్లు ఆధారాలున్నాయి. ఈయన తన చిన్నతనంలో మాధవాచార్యులు అనే పేరుతో కొన్నిరోజులు పెనుకొండలో నివసించారని పెనుకొండ మీద ఉన్న ప్రేమతో విజయనగర సామ్రాజ్య స్థాపకులు హరిహర బుక్కరాయల ప్రధానమంత్రిగా ఆయన పెనుకొండకు వచ్చి ఈ శివాలయాన్ని, అందులోని శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు ఆధారాలు చెబుతున్నాయి.

ప్రజల సహకారంతో ఆలయ అభివృద్ధి



ఆలయ నిర్వహణకు మాన్యాలు లేవు. ఆలయ అర్చకులు రామాచార్యులు తన సొంత ఖర్చులతో ధూపదీప నైవేద్యాలు నిర్వహించేవారు. అనంతరం ఆయన కుమారుడు వేణుమాధవ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన అనారోగ్యానికి గురి కావడంతో పూజా కర్యక్రమాలు చేసేవారులేక ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఇది గమనించిన కొందరు దాతలు ఒక కమిటీగా ఏర్పడి కొత్తగా అర్చకులను నియమించి ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపడుతున్నారు. 26న శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం.

- కమిటీ అధ్యక్షుడు బొక్సంపల్లి రామక్రిష్ణప్ప

న్యూస్ బాక్స్

శివాలయంలో ప్రత్యేక పూజలు



అర్ధనారీశ్వరుడిగా దర్శనమిస్తున్న శివుడు

సోమందేపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేం ద్రంలోని వేంకటేశ్వర కల్యాణమండపం ఆవరణలో ఉన్న శి వాలయంలో సోమవారం ప్రత్యే క పూజలు జరిగాయి. మాఘమాసం చివరి సోమవారం కావడంతో భక్తులు పోటెత్తారు. అర్ధనారీశ్వరుడి రూపంలో శివుడు భక్తులకు దర్శనమివ్వగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

పంచనందీశ్వరాలయంలో..

చిలమత్తూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని కొడికొండలో వెలసిన పంచనందీశ్వరాలయంలో మంగళవారం నుంచి మార్చి 1వ తేదీ వరకు శివరాత్రి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు బాలసుబ్రమణ్యం తెలిపారు. ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం పంచాయతీ గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు టీడీపీ నాయకులు సోమవారంభూమి పూజ చేసి ప్రారంభించారు. కూటమి ప్రభుత్వ వచ్చిన తరువాత గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ఉపాధి పథకం ద్వారా నిధులు మంజూరు చేసింది. కొండాపురం పంచాయతీ మల్లె గ్రామంలో సీసీరోడ్లకు శంకుస్థాపన చేసిన నాయకులు గ్రామంలో పర్యటించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల నాయకులు అశ్వత్థరెడ్డి, బాలక్రిష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్, వెంకటరంగారెడ్డి, ఉత్తమరెడ్డి, నరేష్, నరేంద్ర, మహేంద్ర, శీనా, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

జనసేన పార్టీలోకి పలువురి చేరిక



జనసేన పార్టీలో చేరుతున్న యువకులు

చిలమత్తూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జనసేన నాయకులు చిన్న ప్రవీణ్, ఎల్ఐసీ వెంకటరమణ ఆధ్వర్యంలో పలువురు యువకులు సోమవారం ఆ పార్టీలో చేరారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల మనసులను గెలుచుకుంటోందన్నారు. అందులో భాగంగా జనసేన ప్రజల పక్షాన నిలుస్తూ వారి సంక్షేమం కోసం ప్రభుత్వంలో భాగస్వామ్యమైందన్నారు. దాంతో ప్రజలు పార్టీ వైపు మొగ్గుచూపుతున్నారన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాలు ప్యాక్ చేస్తున్న సిబ్బంది

హిందూపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే ఇంటర్ పరీక్ష ప్రశ్నాపత్రాలు స్టేషన్‌కు చేరాయి. సోమవారం ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని వాటిని ఏఏ కళాశాలలకు ఎన్ని పత్రాలు పంపాలని లిఖితపూర్వకంగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ పత్రాలను స్టేషన్‌లో భద్రపరిచారు.

డిప్యూటీ డీఈఓ బాధ్యతల స్వీకరణ



పద్మప్రియను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెనుకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పెనుకొండ డిప్యూటీ డీఈఓగా చిలమత్తూరు మండలం ఎంఈఓగా పని చేస్తున్న పద్మప్రియ ఎఫ్ఏసీ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ డిప్యూటీ డీఈఓగా పనిచేస్తున్న రంగస్వామి చిత్తూరు జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో పద్మప్రియ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ విద్యావ్యవస్థ గాడిలో పెట్టడానికి తనవంతు కృషిచేస్తానని త్వరలో జరిగే అన్ని పరీక్షలను పకడ్బందీగా నిర్వహించి డివిజన్‌ను అగ్రస్థానంలో నిలుపుతానన్నారు. బాధ్యతలు తీసుకున్న ఆమెను మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బాడీ బిల్డింగ్‌లో పురం యువకుడి ప్రతిభ



సాధించిన మెడల్స్‌తో నవీద్

హిందూపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం చెన్నైలో ఆదివారం వరల్డ్ ఫిట్‌నెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిస్టర్ ఇండియా, ఆల్‌ఇండియా ఓపెన్ బాడిబిల్డింగ్ పోటీల్లో పురం యువకుడు ప్రతిభకనబరిచాడు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మంది బాడిబిల్డర్లు పాల్గొన్నారు. ఇందులో హిందూపురానికి చెందిన నవీద్ పాల్గొన్నాడు. జూనియర్ మెన్ ఫిజిక్ క్యాటగిరిలో గోల్డ్ మెడల్, సీనియర్ బాడి బిల్డింగ్‌లో సిల్వర్ మెడల్, సీనియర్ బాడిబిల్డింగ్‌లో సిల్వర్ మెడల్, క్లాసిక్ ఫిజిక్ కేటగిరిలో నాలుగోస్థానం సాధించాడు. యువకుడిని గోల్డెన్ జిమ్ ప్రతినిధులు అభినందించారు.

ఇంగ్లీష్ రైటింగ్‌లో నమితకు ప్రథమస్థానం

పావగడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శిర తాలూకాలో ఇంగ్లీష్ రైటింగ్‌లో జరిగిన రాతలపోటీల్లో పావగడ విద్యార్థిని నమిత మొదటి స్థానం సాధించింది. గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న నమిత ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్‌ను సుందరంగా రాయడంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థినిని పోటీలకు ఎంపిక చేసింది. సోమవారం శిర తాలూకాలోని వాసవీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని అందరి మన్ననలు పొందింది.

పండ్లతోట దగ్ధంపై పోలీసులకు ఫిర్యాదు

గోరంట్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేరు గ్రామంలో టీడీపీ మండలకన్వీనర్ సోముశేఖర్‌కు చెందిన పండ్లతోట దగ్ధంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ శేఖర్ సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సమీపంలోని పొలానికి చెందిన వ్యక్తులు నిప్పు అట్టించడంతో మంటలు పండ్లతోటను చుట్టుముట్టి నాలుగు ఎకరాల్లోని మూడువందల సపోట చెట్లు, అర ఎకరాలోని 30 మామిడి చెట్లు, డ్రిప్ పరికరాలు ఆదివారం దగ్ధమైన విషయం తెలిసిందే. అగ్నిమాపక యంత్రం రాకపోవడంతో మంటలను అదుపు చేయలేని కారణంగా దాదాపు రూ.రెండులక్షలకుపై ఆస్తి నష్టం వాటిల్లింది. ఉద్దేశపూర్వకంగానే ఎవరైనా నిప్పుపెట్టి ఉంటారన్న అభిప్రాయంతో బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆకోణంలో దర్యాప్తు చేయడానికి పండ్లతోటను పరిశీలించారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి



వర్ష (ఫైల్)

సోమందేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో అనంతపురం సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ విద్యార్థిని వర్ష(14) ఆదివారం మృతి చెందింది. సోమందేపల్లి షిర్డీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు శంకర, ఆదిలక్ష్మి దంపతుల కుమార్తె వర్ష జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో అస్వస్థతకు గురైంది. విద్యార్థిని మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం తరగతి గదిలోనే అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. సమాచారాన్ని తల్లిదండ్రులకు అందించామన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు.

కియ అనుబంధ కంపెనీలో హౌస్‌కీపర్..



మృతిచెందిన దాళమ్మ

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కియ అనుబంధ ఐసీఎం కంపెనీలో పనిచేస్తున్న హౌస్ కీపర్ దాళమ్మ(48) అనే మహిళ ఆకస్మికంగా మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. కియ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన మేరకు పెనుకొండలోని న్యూ కాలనీకి చెందిన దాళమ్మ ఐదేళ్ల నుంచి కియ అనుబంధ ఐసీఎం కంపెనీలో హౌస్‌కీపర్‌గా పనిచేస్తోంది. సోమవారం పనిచేస్తుండగా ఉన్నఫళంగా స్పృహతప్పి పడిపోయింది. తోటి కార్మికులు, ఉద్యోగులు ఆమెను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దాళమ్మకు భర్త కొల్లన్న, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

గోరంట్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శీనప్పపల్లికి చెందిన రైతు విజయ్‌కుమార్ పాముకాటుకు గురై సోమవారం అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన హనుమన్న కుమారుడు విజయ్‌కుమార్ పొలంలో గడ్డి కోస్తుండగా ఎడమచేతి బొటనవేలిపై పాము కాటు వేసిందని కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రథమచికిత్స అనంతరం పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

అగళి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంజనమ్మ కుమారుడు మూర్తి గత కొంతకాలంగా మతిస్థిమితంలేకుండా ఉండేవాడు. ఆయన సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అగళి జడ్పీటీసీ ఉమేష్ మూర్తి భౌతికకాయంపై పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం రూ.4వేలు ఆర్థిక సాయం అందజేశారు.

బీఎస్పీని బలోపేతం చేద్దాం

హిందూపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్‌పార్టీ(బీఎస్పీ)ని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ మల్లికల్ అన్నారు. సోమవారం హిందూపురంలో ఆ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 10వ తేదీన విజయవాడలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా గౌతమ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిర్వహించే సభకు తరలి రావాలన్నారు. టీడీపీ, వైసీపీ, బీజేపీ, జనసేన పార్టీల మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, ఇర్ఫాన్, సుబ్బరాయప్ప, సత్యానందమూర్తి, మౌలాలి, హరికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

హిందూపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభ చాటిన విద్యార్థినిని కళాశాల అధ్యాపక బృందం అభినందించింది. ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న దుర్గ ఇటీవల జరిగిన జాతీయ సమైక్య శిబిరంలో ప్రతిభ చాటింది. విద్యార్థినిని సోమవారం ప్రిన్సిపాల్ ప్రగతి, అధ్యాపకులు అభినందించారు. ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ విభాగం తరఫున ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికై మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగిన శిబిరంలో పాల్గొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలపై ప్రసంగించి జానపద నృత్యంలో విశేష ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశులు, శ్రీలక్ష్మి, రమేష్, నరసింహులు, బాలిరెడ్డి పాల్గొన్నారు.

ఫేక్ ఫోన్‌కాల్స్ నమ్మకండి

పెనుకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో కొందరు అపరిచితులు తాను మునిసిపల్ కమిషనర్ కార్యాలయ సిబ్బంది అంటూ కొందరు ఫేక్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు కమిషనర్ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి, కొళాయి గుత్తలు, తదితర వాటిని వెంటనే చెల్లించాలని ఫోన్‌కాల్స్ ద్వారా డిమాండ్ చేస్తున్నారని అందుకు సంబంధించిన ఫోన్‌పే నంబర్లు చెబుతున్నారన్నారు. ఇలాంటి వాటిపై ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. మునిసిపల్ అధికారులు ఫోన్ల ద్వారా, స్కానర్ ద్వారా గుత్తలు చెల్లించమని కోరడం లేదన్నారు. అలా ఎవరైనా అపరిచితులు కోరితే వెంటనే పోలీసులకు, నగర పంచాయతీ అధికారులకు 08555-22111 నంబరుకు ఫోన్ చేయాలని కమిషనర్ సూచించారు.

బెంగళూరుకు తరలిరండి



మాట్లాడుతున్న సుశీలమ్మ

పావగడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): దినకూలి కార్మికులు, అంగనవాడీ కార్యకర్తలు, వంటకూలీలు, హమాలీల సమస్యల పరిష్కారం కోసం మార్చి 3 నుంచి 7వ తేదీ వరకు బెంగళూరు ఫ్రీడం పార్కులో చేపడుతున్న నిరాహారదీక్షకు తరలిరావాలని కార్మిక సంఘం అధ్యక్షురాలు సుశీలమ్మ పిలుపునిచ్చారు. కార్మికుల పిల్లలకు మౌలిక సదుపాయాలు, ఆరోగ్యబీమా, స్కాలర్‌షిప్‌లు అందించేందుకు ప్రభుత్వానికి ఎన్నిమార్లు విన్నవించినా స్పందించలేదని వాపోయారు. తమ పోరాటాలతో హక్కుల సాధనకోసం కలిసికట్టుగా తరలిరావాలని ఆమె కోరారు.

బెస్కాం కార్యాలయం ఎదుట రైతుల రాస్తారోకో



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యాప్తంగా కరెంటు కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో విద్యుత్ అందించి ఆదుకోవాలని కోరుతూ బెస్కం కార్యాలయం ఎదుట రైతులు ధర్నా చేపట్టారు. శనిమహాత్మ సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీగా వచ్చి విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం బెస్కాం కార్యాలయానికి చేరుకుని రైతులు రాస్తారోకో చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప మాట్లాడుతూ దేశానికి అన్నంపెట్టే రైతు, కాపలా కాసే సైనికుడు రెండు కళ్లలాంటివారని వీరిద్దరిని ప్రభుత్వం చిన్నచూపు చూడటం దారుణమన్నారు. తాలూకా వ్యాప్తంగా ప్రతిరోజూ విద్యుత్‌కోతలు, ఎల్‌సీలు, లోవోల్టేజిలతో విద్యుత్ అందించలేకపోతున్నారని పంట చేతికొచ్చే సమయంలో కరెంటు కోతలు రైతులు అల్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తమ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని ఏఈఈ క్రిష్ణమూర్తికి అందించారు.

భూవిషయమై తహసీల్దార్ కార్యాలయంలో ఘర్షణ



తహసీల్దార్ కార్యాలయంలో బాహాబాహీకి దిగిన దృశ్యం

గోరంట్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బూగానిపల్లికి చెందిన ఇరువురు భూ విక్రయానికి సంబంధించి సోమవారం ఘర్షణకు దిగారు. భూమి విక్రయానికి సంబంధించి బూగానిపల్లికి చెందిన వైసీపీ నాయకుడు, అంగన్‌వాడీ కార్యకర్త భర్త నరేష్, అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆంజనేయులతో గొడవపడ్డారు. అంగన్‌వాడీకి సంబంధించి, ఇతర విషయాల్లో జోక్యం చేసుకుంటున్నామంటూ నరేష్ తనపై దాడికి దిగినట్లు ఆంజనేయులు ఆరోపించారు. ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఆంజనేయులుకు స్వల్పంగా గాయాలయ్యాయి. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లేకపోవడంతో వీఆర్‌ఓ అశోక్, రెవెన్యూ సిబ్బంది ఇరువురిని మందలించి బయటకు పంపారు. ఏదైన వివాదాలతుంటే బయట చూసుకోవాలని, కార్యాలయంలో కాదని మందలించినట్లు వీఆర్‌ఓ తెలిపారు. తనపైదాడిచేసి గాయపరిచినట్లు ఆంజనేయులు గోరంట్ల పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

రేపటి నుంచి సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



అలంకరణలో స్వామివారు

మడకశిర టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం హెంజేరు సిద్ధేశ్వరస్వామి. బుధవారం నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మడకశిర నియోజకవర్గ కేంద్రానికి 40 కి.మీ దూరంలో అమరాపురం మండల కేంద్రానికి 11 కి.మీ దూరంలో సిద్ధేశ్వరాలయం ఉంది. దక్షిణభారత దేశంలో పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ మానవాకృతిలో మహాశివుడు దర్శనమిస్తారు. దక్షిణ భారతంలోనే హేమావతిలో మాత్రమే ఇలా మానవుడి రూపంలో రుండమాలదరుడిగా ఉండడం విశేషం. సూర్యాస్తమయ సమయంలో సిద్ధేశ్వరస్వామి నుదుటిపై సూర్యుని కాంతిపడి ఆలయం వెలుగుతో ప్రజ్వరిల్లడం చూపరులను ఆకట్టుకుంటుంది.

స్వామివారి బ్రహ్మోత్సవాలు: స్వామివారి బ్రహ్మోత్సవాలు మహాశివరాత్రి పురస్కరించుకొని బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అదే రోజు రుద్రాభిషేకం, అఖండ పూజలు, 27న భానుపల్లకి ఉత్సవం, 28న అగ్నిగుండ మహోత్సవం, 1న సాయంత్రం 4 గంటలకు సిడిమాను ఉత్సవం, 2న సాయంత్రం 4.30 గంటలకు చిన్న రథోత్సవం, 3న సాయంత్రం బ్రహ్మరథోత్సవం, వసంతోత్సవం, 4న నయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోండి

లేపాక్షి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): లేపాక్షిలో మంగళవారం నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శాంతీయుతంగా జరుపుకోవాలని హిందూపురం డీఎస్పీ మహేష్ సూచించారు. సోమవారం లేపాక్షి ఆర్‌జెహెచ్ ఫంక్షన్‌హాల్‌లో గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు ఇతర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు వస్తారని, ఎటువంటి గొడవలు జరగకుండా శాంతీయుతంగా జరుపుకోవాలన్నారు. హిందూపురం రూరల్ సీఐ జనార్దన్, లేపాక్షి ఎస్ఐ నరేంద్ర, చిలమత్తూరు ఎస్ఐ మునీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

రజకుల అభివృద్ధికి కృషి: చైర్మన్



మాచిదేవ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చైర్మన్

హిందూపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రజకుల అభివృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ అన్నారు. సోమవారం బైపాస్‌రోడ్డులో ఉన్న రజకుల కులదైవమైన మాచిదేవ జయంతి కార్యక్రమం సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలువేసి చైర్మన్ పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ రజకుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని, భవిష్యత్తులో కూడా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి గెలుపొందిన మహిళలకు చీరలు అందజేశారు. మాచిదేవ విద్యా, వృత్తి, సాంస్కృతిక సంఘం గౌరవాధ్యక్షుడు సిద్దేశ్వర్ మాట్లాడుతూ రజకులు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జనార్దన్, నారాయణప్ప, నరసింహప్ప, నరసింహమూర్తి, కుల్లాయప్ప, మురళి పాల్గొన్నారు.

ఇసుక, మట్టి రవాణాకు సహకరించండి



ఎస్ఐకి వినతి పత్రం ఇస్తున్న కూటమి నాయకులు

పరిగి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలు, ట్రాక్టర్ యజమానులను ఇబ్బందులు కలిగించకుండా ఇసుక, మట్టి రవాణా సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ రంగడు యాదవ్‌కు సోమవారం కూటమి నాయకులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఇసుక, మట్టి తరలింపులో పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎస్ఐ దృష్టికి తెచ్చారు. మాజీ ఎంపీపీ సత్యనారాయణ, ఈశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, శేఖర్, కుమార్, మాజీ వైస్ ఎంపీపీ నరసింహులు, వడ్డె సురేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్ఎఫ్ఐ 6వ మహాసభ



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

పెనుకొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి కళాశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ ముగిసింది. మహాసభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, వెంకటేశ్ హాజరై ప్రసంగించారు. విద్యార్థుల సమస్యలపై భవిష్యత్ కార్యచరణ ప్రణాళిక సంఘ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జింక కళేబరం అప్పగింత

హిందూపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మలుగూరువద్ద పోతిరెడ్డి అనే వ్యక్తి జింక మాంసం అమ్ముతున్నాడన్న సమాచారంతో అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ ఆంజనేయులు వెళ్లి ఆరాతీశారు. ఆదివారం పోతిరెడ్డి అనే వ్యక్తి తన పొలంవద్ద జింకలను వేటాడాలనే ఉద్దేశ్యంతో పొలం చుట్టూ కరెంటు తీగలు చుట్టి అందుకు కరెంటు వదులుతాడు. జింకలు షాక్‌కు గురై చనిపోయాక వాటి మాంసాన్ని అమ్ముతున్నాడు. దీంతో అక్కడికి వెళ్లిన సందర్భంలో జింక తల, మాంసం పట్టుబడగా దానిని స్వాధీనం చేసుకుని పోతిరెడ్డిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆదివారం ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదు. జిల్లా అధికారికి సమాచారం ఇవ్వడంతో సోమవారం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఫారెస్ట్ అధికారులకు జింక తల, మాంసం అప్పగించారు. పోతిరెడ్డిని కూడా ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఫిర్యాదుల స్వీకరణ

హిందూపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. 30ఫిర్యాదులు అందినట్లు డీఎస్పీ తెలిపారు. ప్రతి సోమవారం ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. సీఐలు రాజగోపాల్‌నాయుడు, జనార్దన్, ఆంజనేయులు, అబ్దుల్ కరీం, పాల్గొన్నారు.